పది రోజుల్లో 'సాగర్' నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలి

లేదంటే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర చేస్తా

మిర్యాలగూడ రైతు మహాధర్నాలో కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు తరలివెళుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పట్టించుకోవడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబరు 13లోపు సాగర్ ఎడమకాల్వ పరిధిలో ఉన్న ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలకు సాగర్ నీటి షెడ్యూల్ ప్రకటించి సమృద్ధిగా తడులు అందించాలని, లేదంటే కోదాడ నుంచి హాలియా వరకు బాధిత రైతులతో

-8 లో

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

కాంగ్రెస్ భూ'భారతి'..! భూములన్నీ 'హారతి'..!

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో ప్లకార్డుల ప్రదర్శనతో నిరసన ర్యాలీ..

- దుండిగల్ ఎమ్మార్వో ఆఫీసు ముందు బైటాయించిన బీఆర్ఎస్ సైన్యం..
- తహాశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు,..
- వెయ్యి రోజులు గడిచినా..! హామీల అమలు ఏది..? బీఆర్ఎస్ శ్రేణులు నిరసన ధర్నా..
- అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్సీ ఆరోపణలు..

-4లో

'సిఎంసి చర్యలంటే... స్లాబ్‌లు కొట్టడమేనా..?

సూరారం కాలనీలో కొంపల్లి సర్కిల్ అధికారుల చర్యల నిర్వాకం..

కమిషనర్ ఆదేశాలు అమలు చేస్తున్నారా..? బేఖాతర్ చేస్తున్నారా..?

-6 లో

ఈఓఎస్-05 ప్రయోగం దిగ్విజయం

నింగిలోకి 'ఇస్రో' నిఘా నేత్రం

హైదరాబాద్ పెన్ పవర్:భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఖాతాలో మరో చారిత్రక ఘనత చేరింది. దేశ రక్షణ, విపత్తుల నిర్వహణ రంగాల్లో కీలకమైన 'ఈఓఎస్-05'(జీశాట్-1ఏ) ఉపగ్రహ ప్రయోగం దిగ్విజయం అయింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శుక్రవారం చేపట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 మిషన్ విజయవంతమైంది.

కచ్చితత్వంతో కక్ష్యలోకి..

శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 వాహకనౌక మేఘాలను చీల్చుకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. సరిగ్గా 18 నిమిషాల తర్వాత(3.13 గంటలకు) 2,367 కిలోల బరువున్న ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని సబ్-జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(సబ్-జీటీఓ)లోకి రాకెట్ కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది. ఉపగ్రహం పెరిజీ(భూమికి దగ్గరి బిందువు) 170 కి.మీ, అపోజీ(దూరపు బిందువు) 28,934 కి.మీ కక్ష్యలోకి చేరుకుంది. 51.7 మీటర్ల ఎత్తు, 420.5 టన్నుల బరువున్న ఈ రాకెట్ ద్వారా చేపట్టిన ప్రతిష్ఠాత్మక జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం కావడం విశేషం.

అంతరిక్షంలో అద్భుత కెమెరా..

సాధారణంగా లో-ఎర్త్ ఆర్బిట్(లియో), సన్ సింక్రోనస్ ఆర్బిట్లలో ఉండే ఉపగ్రహాలు ఒక ప్రాంతాన్ని ఫొటో తీయడానికి కొన్ని రోజుల నుంచి

-6 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

- ఎస్ఐఆర్-2026 నోటీసుల హియరింగ్, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలి..
- అర్హులైన ప్రతి ఓటరు పేరు పక్కాగా నమోదయ్యేలా చర్యలకు ఆదేశం..
- మేడ్చల్ జిల్లాలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి విస్తృతంగా పర్యటించారు..
- పలుచోట్ల ఓటరు జాబితా సంబంధిత ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

- ఓటర్ల జాబితాలో తప్పులకు చెక్.. ఎస్ఐఆర్‌పై సీఈఓ సీరియస్..!
- హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి.. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలి..
- ఎస్ఐఆర్-2026 ప్రక్రియ వేగవంతం చేసి, మ్యాపింగ్ కాని ఓటర్లపై ప్రత్యేక దృష్టి..
- ఓటర్ కార్డులో వ్యత్యాసాలపై పకడ్బందీ పరిశీలనతో పరిష్కరించాలి..
- ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలు పరిశీలించాలి..
- హియరింగ్, అభ్యంతరాల పరిష్కారంలో పారదర్శకత పాటించాలి..
- నిర్దేశిత గడువులో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని 'సీఈఓ' ఆదేశాలు..

ఓటరు జాబితా సవరణలో... అలసత్వానికి తావివ్వొద్దు..!

తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి..

-5 లో

దుండిగల్ ఎమ్మార్వో కార్యాలయం ముందు బీఆర్ఎస్ శ్రేణుల బైఠాయింపు..

నిరసన ధర్నాలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..

కాంగ్రెస్ భూ'భారతి'..! భూములన్నీ 'హారతి'..!

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో ప్లకార్డుల ప్రదర్శనతో నిరసన ర్యాలీ..

- దుండిగల్ ఎమ్మార్వో ఆఫీసు ముందు బైఠాయించిన బీఆర్ఎస్ సైన్యం..
- తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు,..
- వెయ్యి రోజులు గడిచినా..! హామీల అమలు ఏది..? బీఆర్ఎస్ శ్రేణులు నిరసన ధర్నా..
- అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్సీ ఆరోపణలు..

- 2 బీహెచ్‌కే ఇళ్లు నిర్మించి.. అర్హులకు కేటాయించక పోవడంపై ప్రశ్నలు..
- పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జాప్యం ఎందుకు..?
- 22-ఏ భూముల సమస్యకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం చూపలేదు..
- రూ.15 వేల రైతు భరోసా హామీ ఏమైంది..? హామీలతో అధికారం.. ఇదేనా పాలన..?
- ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి: శంభీపూర్ రాజు..

బీఆర్ఎస్ ప్లకార్డుల ప్రదర్శన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు..



దుండిగల్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు..

దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా..! ఎన్నికల హామీలు నేటికీ అమలు కాలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా, ప్రభుత్వం విఫలమైందని, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆరోపించారు.. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు.. గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.. ప్రభుత్వ హామీల అమలు జాప్యం, ప్రభుత్వం తీరును వ్యతిరేకిస్తూ ప్లకార్డుల ప్రదర్శనతో నినాదాలు చేశారు.. పార్టీ కార్యాలయం నుండి, దుండిగల్ ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళిన బీఆర్ఎస్ నాయకులు, తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు.. 1000 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వం పాలన, 100 శాతం విఫలమైందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆరోపించారు.. అనంతరం దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి..

ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.. "ప్రజా సమస్యల కోసం పోరాడతాం.. హామీల అమలు కోసం ఉద్యమిస్తాం.. ప్రజల హక్కుల కోసం గళమెత్తుతాం" అని పేర్కొన్నారు.. తహసీల్దార్‌కు అందజేసిన వినతిపత్రంలో 2 బీహెచ్‌కే ఇళ్లు తక్షణ కేటాయింపు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం, 22-ఏ భూముల సమస్యకు పరిష్కారం వంటి అంశాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు..

ప్లకార్డు ప్రదర్శిస్తున్న దుండిగల్ మాజీ కౌన్సిలర్ బండారి మహేందర్ యాదవ్..

పూర్తయిన 'టు-బీహెచ్‌కే' ఇళ్ళ కేటాయింపు జాప్యం..?

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన 'టు-బీహెచ్‌కే' ఇళ్లు పూర్తయి సిద్దంగా ఉన్నప్పటికీ అర్హులైన పేదలకు, పూర్తిస్థాయిలో కేటాయించక పోవడంపై బీఆర్ఎస్ ప్రశ్నించింది.. నిర్మించిన ఇళ్లు ఖాళీగా ఉంచడమేనా..? అర్హులైన నిరుపేదలకు ఇళ్లను కేటాయించడంలో ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటి..?అంటూ నిలదీశారు.. లబ్ధిదారులను గుర్తించి పెండింగ్‌లో ఉన్న 2 బీహెచ్‌కే ఇళ్లను తక్షణమే కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులకు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని,డిమాండ్ చేశారు..

ప్లకార్డుల ప్రదర్శనతో మార్మోగిన నినాదాలు..

దుండిగల్‌లో ఆందోళన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు ప్రదర్శించిన ప్లకార్డులతో, ప్రభుత్వవైఖరిని, ప్రజల్లోకి తీసుకెళ్ళిన తీరు, రాజకీయ ఘాటు విమర్శలకు వేదికగా మారింది.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన, కాంగ్రెస్ పార్టీ.. 1000 రోజులుగా మోసపూరిత హామీలతో ప్రజలకు అన్యాయం చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు.. ప్లకార్డుల ప్రదర్శనతో బీఆర్ఎస్ తీసిన ర్యాలీలో అనేక ప్రశ్నలు లేవనెత్తింది.. 22-ఎను ఉద్దేశించి "కాంగ్రెస్ భూభారతి.. భూములన్నీ హారతి..!" అంటూ ప్లకార్డులపై ఘాటు విమర్శలు, భూ విధానాలపై ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ శ్రేణులు, తమ ఆరోపణలతో దృశ్యరూపాన్ని చూపించారు..

వెయ్యి రోజులు.. వెయ్యి ప్రశ్నలు..!

అదేవిధంగా కాంగ్రెస్ హామీలలో రూ.15 వేలు రైతు భరోసా హామీ అంశాన్ని ప్రస్తావిస్తూ ప్లకార్డుల ప్రదర్శన దర్నాకు ప్రత్యేకంగా నిలువగా.. రైతులకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని గులాబీ నేతలు డిమాండ్ చేశారు.. దీంతో ఆందోళన చేపట్టిన ఎమ్మార్వో కార్యాలయం ప్రాంగణంలో "హామీలు ఎక్కడ..? అమలు ఎక్కడ ..? "ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి" అంటూ చేసిన నినాదాలు మార్మోగాయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా గుర్తుచేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ పనితీరును ప్రశ్నించారు.. రైతు భరోసా, ఇళ్ల పథకాలు, భూముల సమస్యలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చేసింది ఏమిటో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెప్పాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు..

22-ఏ భూముల సమస్యపై శాశ్వత పరిష్కారం చూపాలి..

దుండిగల్ గండిమైసమ్మ మండలంతో పాటు నియోజకవర్గం పరిధిలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ నేత ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు డిమాండ్ చేశారు.. ఈ 22-ఎ భూముల సమస్యల కారణంగా సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు..

ఎమ్మార్వో కార్యాలయానికి తరలిన గులాబీ దండు, ర్యాలీ..



బీఆర్ఎస్ కార్యకర్తలతో ఎమ్మెల్సీ రాజు, మాజీ కౌన్సిలర్ మహేందర్ యాదవ్..

- ఎస్ఐఆర్-2026 నోటీసుల హియరింగ్, పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలి..
- అర్హులైన ప్రతి ఓటరు పేరు పక్కాగా నమోదయ్యేలా చర్యలకు ఆదేశం..
- మేడ్చల్ జిల్లాలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి విస్తృతంగా పర్యటించారు..
- పలుచోట్ల ఓటరు జాబితా సంబంధిత ప్రక్రియను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

- ఓటర్ల జాబితాలో తప్పులకు చెక్.. ఎస్ఐఆర్‌పై సీఈఓ సీరియస్..!
- హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి.. అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం చేయాలి..
- ఎస్ఐఆర్-2026 ప్రక్రియ వేగవంతం చేసి, మ్యాపింగ్ కాని ఓటర్లపై ప్రత్యేక దృష్టి..
- ఓటర్ కార్డులో వ్యత్యాసాలపై పకడ్బందీ పరిశీలనతో పరిష్కరించాలి..
- ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలు పరిశీలించాలి..
- హియరింగ్, అభ్యంతరాల పరిష్కారంలో పారదర్శకత పాటించాలి..
- నిర్దేశిత గడువులో ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని 'సీఈఓ' ఆదేశాలు..

సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి వి.వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ మను..

ఓటరు జాబితా సవరణలో... అలసత్వానికి తావివ్వొద్దు..!

మేడ్చల్ మండలం మునీరాబాద్‌లో ఎన్నికల అధికారి పరిశీలన..

తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 3: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులపై హియరింగ్, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను వేగవంతంగా, నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు.. అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు కచ్చితంగా ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూప్రాధాన్యం..లిరువారం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించారు.. అదనపు ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి "ఈవిఎం"లు-వివిప్యాట్" లను, భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు. అక్కడ భద్రతా ఏర్పాట్లు, యంత్రాలు భద్రపరిచిన విధానం తదితర అంశాలను పరిశీలించారు..

నర్సంపల్లి నుంచి దొమ్మర పోచంపల్లి వరకు పరిశీలన..

అనంతరం ఎస్ఐఆర్-2026 నోటీసుల హియరింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా.. కీసర మండలం నర్సంపల్లి, మేడ్చల్ మండలం మునీరాబాద్, దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి ప్రాంతాల్లో జరుగుతున్న హియరింగ్ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి వి.వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల అధికారి మను చౌదరితో కలిస స్వయంగా పరిశీలించారు.. హియరింగ్‌కు హాజరవుతున్న ఓటర్ల వివరాలు, వారి నుంచి స్వీకరిస్తున్న ధృవీకరణ పత్రాలు, రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయిలో అందిస్తున్న సహాయం, ఓటరు వివరాల ధృవీకరణ వంటి అంశాలను అధికారులు పరిశీలించారు..

మ్యాపింగ్ కాని ఓటర్లపై ప్రత్యేక దృష్టి..!

జిల్లాలో ఇప్పటికీ మ్యాపింగ్ జరగని ఓటర్ల వివరాలతో పాటు ఓటరు కార్డుల్లో నమోదైన వ్యత్యాసాలు, ఉన్న కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల పరిశీలనను పకడ్బందీగా నిర్వహించాలని 'సీఈఓ' సుదర్శన్ రెడ్డి సూచించారు.. నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు హాజరైనప్పుడు వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, సమర్పించిన ఆధారాలను పూర్తిగా ధృవీకరించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు..

పారదర్శకతకు ప్రాధాన్యం..

ఎస్ఐఆర్ హియరింగ్ ప్రక్రియలో ఎక్కడా అలసత్వానికి తావులేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనల మేరకు వ్యవహరించాలని, 'ఈఆర్ఓ'లు, 'ఏఈఆర్ఓ'లు, సూపర్వైజర్లు, బిఎల్ఓలను ఆదేశించారు.. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదు అయ్యేలా, సంబంధిత పత్రాల పరిశీలనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.. నిర్దేశిత గడువులోగా ఈ ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైనంత సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని పనులను కొనసాగించాలని అధికారులకు సూచించారు..

రోజువారీ పురోగతిపై సమీక్ష..

హియరింగ్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, రికార్డుల ధృవీకరణ వంటి తదితర అంశాలపై రోజువారీగా సమీక్ష నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతూ, నిర్ణీత సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వెంకట రెడ్డి, శ్యామ్ ప్రకాశ్,, ఏఈఆర్ఓలు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు..

దుండిగల్ మండలం, దొమ్మర పోచంపల్లి ఎస్ఐఆర్ కేంద్రం వద్ద..

జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన సీఈవోకు పోలీసుల గౌరవ వందనం..

ఈవిఎంల గోదాముల వద్ద రాజకీయ పార్టీలతో ఎన్నికల అధికారుల పరిశీలన..

ఈవిఎంలు భద్రపరచిన గోదాము వద్ద,

'సిఎంసి చర్యలంటే... స్లాబ్‌లు కొట్టడమేనా..?

సూరారం కాలనీలో కొంపల్లి సర్కిల్ అధికారుల చర్యల నిర్వాకం..

కమిషనర్ ఆదేశాలు అమలు చేస్తున్నారా..? బేఖాతర్ చేస్తున్నారా..?

అక్రమ నిర్మాణంలోని 4వ అంతస్తులో సీసీరోడ్డు బ్రేకర్‌తో, స్లాబ్‌కు రంధ్రాలు చేస్తున వాహనం..

- స్లాబ్‌కు రంధ్రాలు చేస్తే.. అదనపు అంతస్తులు కూలినట్టేనా..?
- స్లాబ్‌లు కొట్టడం వల్ల రోడ్డు ఆక్రమణ తొలగుతుందా..?
- అదనపు అంతస్తులు అలాగే ఉంటే.. అక్రమ నిర్మాణం కూల్చినట్టేనా..?
- సెట్‌బ్యాక్‌లో నిర్మాణం కొనసాగితే.. నిబంధనలు అమలైనట్టేనా..?
- రోడ్డు కబ్జా అలాగే ఉంది.. అంతస్తులు అలాగే ఉన్నాయి..మరి కూల్చింది ఏంటి..?
- కొంపల్లి సర్కిల్ 'సిఎంసి' టౌన్‌ప్లానింగ్ చర్యలపై స్థానికుల ప్రశ్నలు..

సిఎంసి, బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 3:
అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఏమేరకు అమలు చేస్తున్నారు..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ భవనాలపై చర్యల పేరుతో కేవలం స్లాబ్‌లకు మాత్రమే రంధ్రాలు చేయడంతోనే, అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలు, టౌన్‌ప్లానింగ్ వ్యవస్థే ప్రశ్నార్థకంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అసలు అక్రమ నిర్మాణం పూర్తిగా తొలగించకుండా ఇటువంటి చర్యలతో ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కొంపల్లి సర్కిల్ పరిధి సూరారం కాలనీలో ఓ నిర్మాణ దారుడు, 4 అడుగుల మేర రోడ్డును ఆక్రమించి, ఐదు అంతస్తులతో నిర్మించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఆరోపణలు ఎదుర్కొంటున్న సంబంధిత భవనంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇటీవల చేపట్టిన చర్యలు చర్చనీయాంశంగా మారాయి. సుమారు పది రోజుల క్రితం సంబంధిత భవనంలోని నాలుగో అంతస్తు స్లాబ్‌ను కొద్దిగా పగలగొట్టి అధికారులు వెనుదిరిగినట్లు స్థానికులు చెబుతున్నారు..

- 4 అడుగుల రోడ్డు ఆక్రమణ.. 5 అంతస్తుల అక్రమ నిర్మాణం..
- సెట్‌బ్యాక్‌ల ఆక్రమణ, అదనపు అంతస్తుల సంగతేంటి..?
- స్లాబ్‌లకు రంధ్రాలు చేస్తే.. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలేవి..?
- ఏ తరహా అక్రమమైనా.. స్లాబ్‌లకు రంధ్రాలు చేయడం ఒక్కటే మార్గమా..?

రోడ్డు ఆక్రమణపై చర్యలేవి..?

సంబంధిత నిర్మాణదారుడు సుమారు నాలుగు అడుగుల మేర రోడ్డును ఆక్రమించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఫొటో దృశ్యాలు ఆక్రమణను నిర్ధారిస్తున్నాయి.. నిజంగా రోడ్డు ఆక్రమణ ఉన్నట్లయితే, ఆ ఆక్రమిత భాగాన్ని తొలగించి రోడ్డును పూర్వస్థితికి తీసుకురావాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.. స్లాబ్‌లు కొట్టడం వల్ల రోడ్డు ఆక్రమణ తొలగుతుందా..? సెట్‌బ్యాక్‌లలో ఉన్న అక్రమ నిర్మాణం తొలగినట్టేనా..?
అదనపు అంతస్తులు అలాగే ఉంటే అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకున్నట్టు ఎలా అవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు..

రోడ్డు ఆక్రమణ ఇదే.. సూరారం కాలనీలో..

స్లాబ్‌కు రంధ్రాలు చేస్తే.. అక్రమ అంతస్తు కూలినట్టేనా..?

అక్రమ నిర్మాణంలో అదనపు అంతస్తులు ఉన్నట్లయితే వాటిని తొలగించకుండా కేవలం స్లాబ్‌లను కొంతమేర ధ్వంసం చేయడం వల్ల నిర్మాణం అక్రమ స్థితి నుంచి సక్రమం అవుతుందా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి..ఒకవైపు అదనపు అంతస్తులు యథావిధిగా ఉండగా, మరోవైపు రోడ్డును ఆక్రమించిన భాగం కూడా అలాగే కొనసాగితే.. అధికారులు తీసుకున్న చర్యను పూర్తిస్థాయి కూల్చివేతగా ఎలా పరిగణించాలన్నది స్థానికుల ప్రశ్న..

కమిషనర్ ఆదేశాలు అమలుపై అనుమానాలు..

మాదాపూర్--గచ్చిబౌలి ప్రాంతంలోని అంజయ్యనగర్‌లో ఏడు అంతస్తుల అక్రమ భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో నగర పరిధిలోని అక్రమ నిర్మాణాలపై, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సిఎంసి కమిషనర్ శ్రీజన కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వివిధ సర్కిళ్లలో అనధికారిక నిర్మాణాలను గుర్తించి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.. అయితే, క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని అక్రమ నిర్మాణాలపై తీసుకుంటున్న చర్యలు ప్రశ్నార్థకంగా ఉన్నాయని స్థానికుల వాదన. కమిషనర్ ఆదేశాల ఉద్దేశం అక్రమ నిర్మాణాన్ని పూర్తిగా నియంత్రించడమా..? లేక కేవలం స్లాబ్‌లకు రంధ్రాలు చేసి వదిలేయడమా..? అన్న చర్చ జరుగుతోంది..

రోడ్డు ఆక్రమణ అలాగే ఉంటే.. రోడ్డు రక్షించబడినట్టేనా..? అదనపు అంతస్తులు అలాగే ఉంటే.. అక్రమ నిర్మాణం కూల్చినట్టు ఎలా అవుతుంది..సెట్‌బ్యాక్ ఉల్లంఘన అలాగే ఉంటే.. కమిషనర్ ఆదేశాలు అమలైనట్టే భావించాలా..? అన్న ప్రశ్నలకు సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.. ఈ వ్యవహారంపై సిఎంసి ఉన్నతాధికారులు ప్రత్యేకంగా విచారణ చేపట్టి, సంబంధిత నిర్మాణానికి అనుమతులు, ప్లాన్, సెట్‌బ్యాక్‌లు, రోడ్డు ఆక్రమణ, అదనపు అంతస్తులు, గతంలో తీసుకున్న చర్యలు, ప్రస్తుతం మిగిలి ఉన్న నిర్మాణం తదితర అంశాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. స్లాబ్‌కు రంధ్రాలు చేయడమే అక్రమ నిర్మాణాలపై చర్యలైతే.. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎక్కడ పడుతుంది..? అన్నదే ఇప్పుడు స్థానికుల ప్రధాన ప్రశ్న..

గచ్చిబౌలి ఘటన తర్వాతైనా మారరా..?

మాదాపూర్ గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మాణ దశలో ఉన్న ఏడంతస్తుల భవనం ఆగస్టు 22న కుప్పకూలి ఇద్దరు మృతి చెందిన ఘటన నగరవ్యాప్తంగా సంచలనం సృష్టించింది..ఈ ఘటనల నేపథ్యంలో అనధికారిక నిర్మాణాలపైఅధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి..అయితే, ఒకవైపు అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపడుతున్నామని అధికారులు చెబుతుండగా.. అవి ప్రాతిపదికన చర్యలు అవుతాయన్న ప్రశ్నలు లేవనెత్తుతోంది.. మరోవైపు కొంపల్లి సర్కిల్ పరిధిలోని సూరారం కాలనీలో మాత్రం చర్యల తీరు స్థానికుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది..

ఈఓఎస్-05 ప్రయోగం దిగ్విజయం

-3 పేజి తరువాయి
వారాల సమయం పడుతుంది. కానీ ఈఓఎస్-05 భూస్థిర కక్ష్యలో (జియో ఆర్బిట్) ఉంటూ.. ఒకే ఫ్రేమ్‌లో మొత్తం దక్షిణాసియాను ఫొటో తీయగలదు. భారత ఉపఖండం మొత్తాన్ని కేవలం 10 నిమిషాలకు ఒకసారి చిత్రీకరించి పంపగలదు. ఇందులో అమర్చిన ఎంఎక్స్-వీఎన్ఆర్ పేలోడ్ అద్భుతమైన 42 మీటర్ల(ఒక పిక్సెల్‌కు) స్పేషియల్ రిజల్యూషన్‌ను కలిగి ఉంది. జియో కక్ష్యలో ఇంతటి అత్యుత్తమ రిజల్యూషన్ కలిగిన కెమెరాతో ఉన్న ఉపగ్రహం ప్రపంచంలోనే ఇదే తొలిసారి. ప్రస్తుతం ఇస్రోకు ఉన్న సామర్థ్యంతో పోలిస్తే.. దీని పిక్సెల్ డెన్సిటీ 567 రెట్లు మెరుగ్గా ఉండటం విశేషం. అత్యుత్తమ పాన్‌క్రోమాటిక్(బ్లాక్ అండ్ వైట్) ఇమేజర్లను సైతం వెనక్కి నెట్టి అత్యంత స్పష్టమైన చిత్రాలను తీయగల సత్తా దీని సొంతం.

రక్షణ, విపత్తుల నిర్వహణలో 'గేమ్ ఛేంజర్'
సరిహద్దుల్లో శత్రు దేశాలు సైనిక స్థావరాలను ఎంత రహస్యంగా దాచినప్పటికీ.. వాటిని ఇట్టే పసిగట్టే సత్తా ఈ ఉపగ్రహానికి ఉంది. వరదలు, తుపాన్లు, కార్చిచ్చులు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పాత చిత్రాలతో పోల్చుకునే పని లేకుండా.. దాదాపు రియల్-టైమ్‌లో వాటి తీవ్రతను అంచనా వేయవచ్చు.

పంటల ఆరోగ్యం, అటవీ ప్రాంతాలు, నీటి వనరుల్లో కాలుష్యం(నాచు), ఖనిజ సంపద పంపిణీ తదితర వివరాలను ఈ హైపర్, మల్టీ స్పెక్ట్రల్స్ కెమెరాలు సులువుగా గుర్తిస్తాయి.

పాత ఓటమికి బదులు తీర్చుకున్న ఇస్రో

2021 ఆగస్టులో జీఎస్ఎల్వీ-ఎఫ్10 మిషన్ ద్వారా ప్రయోగించిన జీశాట్-1 ఉపగ్రహం విఫలమై కక్ష్యను చేరుకోలేకపోయింది. ఆ చేదు జ్ఞాపకాన్ని చెరిపేస్తూ, దానికి ప్రత్యామ్నాయంగా మరింత మెరుగైన సాంకేతికతతో ఇస్రో ఇప్పుడు ఈఓఎస్-05(జీశాట్-1ఏ)ను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చి తన సత్తా చాటింది. ఈ ఏడాది ఆరంభంలో ఎదురైన పీఎస్ఎల్వీ వైఫల్యాన్ని సైతం పక్కకునెట్టి ఇస్రో శాస్త్రవేత్తలు సరికొత్త ఉత్సాహంతో అడుగులు ముందుకేశారు.

వర్షంలోనూ తగ్గని ఉత్సాహం..

ఇస్రో శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు లాంచ్ వ్యూ గ్యాలరీకి
సుమారు 1,500 మంది సందర్శకులు తరలివచ్చారు. రాత్రి 2 గంటల నుంచే వర్షం కురుస్తున్నప్పటికీ వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. వానలో తడుస్తూనే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లే అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి ఉత్సాహం చాటారు.

తలతోక లేని రోమాంచకం

హైదరాబాద్, సెప్టెంబర్ 3, పెన్ పవర్: సుమంత్ ప్రభాస్, అనంతిక జంటగా వచ్చిన చిత్రం 'రోమాంచకం'. ఈ మూవీని భద్రకాళి పిక్చర్స్ బ్యానర్ మీద ప్రణయ్ రెడ్డి వంగా నిర్మాణంలో వేణు గోపాల్ రెడ్డి తెరకెక్కించారుభద్రకాళి పిక్చర్స్ అనే దానికి ఓ బ్రాండ్ ఉంది. సందీప్ రెడ్డి వంగా ఆ బ్యానర్‌కి ఓ స్టాండర్డ్‌ని సెట్ చేసి పెట్టాడు. అలాంటి బ్యానర్ నుంచి ఓ సినిమా వస్తుందంటే.. మామూలుగానే అంచనాలు ఉంటాయి. ఇక సుమంత్ ప్రభాస్, అనంతిక వంటి యంగ్ స్టర్స్‌తో తీసిన ' రోమాంచకం ' మూవీపై మంచి అంచనాలే ఏర్పడ్డాయి. మరి ఈ మూవీని సెప్టెంబర్ 3న విడుదల చేస్తుండగా.. ఒక రోజు ముందుగానే ప్రీమియర్లు వేశారు. మరి ఈ సినిమా కథ ఏంటి? ఆడియెన్స్‌కి ఈ మూవీ ఏ మేరకు నచ్చే అవకాశం ఉంది? అన్నది ఓ సారి చూద్దాం.

కథ

అన్వేష్ (సుమంత్ ప్రభాస్) స్టార్టప్ బిజినెస్ అంటూ తన ఫ్రెండ్స్‌తో కలిసి తిరుగుతుంటాడు. రోమాంచకం అంటూ అమ్మాయిలు, అబ్బాయిల్ని కలిపే ఓ డేటింగ్ యాప్‌లాంటిది డెవలప్ చేసే ప్రయత్నంలో ఉంటాడు. ఈ క్రమంలోనే ఆ యాప్ ద్వారా చెన్నైలో ఉండే మైథిలి (అనంతిక) పరిచయం అవుతుంది. మెల్లిగా ఏర్పడిన ఆ పరిచయం మరింత క్లోజ్‌గా మారుతుంది. ఓ సారి మైథిలికి సర్ ప్రైజ్ ఇవ్వాలని ఆమె పుట్టిన రోజుకి చెన్నై వెళ్తాడు అన్వేష్. కలుస్తాను అని చెప్పి.. ఆ తర్వాత వెంటనే బ్లాక్‌లో పెట్టేస్తుంది. అలా మూడు నెలలు అన్వేష్‌ని బ్లాక్ చేస్తుంది మైథిలీ. ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేసి.. హైదరబాద్ వస్తున్నా అని చెప్పి కలుస్తుంది. మైథిలి కోసం ఓ ఫ్లాట్‌ని ఏర్పాటు చేస్తాడు అన్వేష్. ఆ ఫ్లాట్‌కి వచ్చిన తర్వాత మైథిల్ మి? అవుతుంది? అసలు మైథిలీ హైదరాబాద్‌కి ఎందుకు వచ్చింది? ఆమె ఎక్కడికి వెళ్తుంది? ఆమెను వెతికే ప్రయత్నంలో అన్వేష్, అతని మిత్ర బృందానికి ఎదురైన పరిస్థితులు ఏంటి? చివరకు మైథిలీ, అన్వేష్ కథకు శుభం కార్డ్ పడుతుందా? లేదా? అన్నది తెలియాలంటే సినిమాని చూడాల్సిందే.'రోమాంచకం' అనే సినిమాతో దర్శకుడు ఏం చెప్పాలని అనుకున్నాడు.. అసలు ఏ పాయింట్లతో కథని అల్లుకున్నాడు.. ఏం రాసుకున్నాడు.. ఏం తీశాడు.. ఏం కన్వే చేయాలని అనుకున్నాడు.. ఇలా ఏ విషయం కూడా ఓ పట్టాన అర్థం కాదు. చాలా చోట్ల కథ సిల్లీగా అనిపిస్తుంది. ఎక్కడా లాజిక్స్ కనిపించవు. అసలు ఏ పాత్రలోనూ సీరియస్‌నెస్ కనిపించదు. అనంతిక ఓకే చేసిన స్క్రిప్ట్ కదా.. పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని ఎవరైనా ఊహించి, ఆశించి వస్తే మాత్రం దారుణంగా నిరాశ చెందాల్సి వస్తుంది.

ప్రథమార్ధం అంతా కూడా హీరో, అతని గ్యాంగ్ చేసే అల్లరితో సాగుతుంది. చాలా వరకు అరిచి గోల పెట్టినట్టుగా సీన్లు కనిపిస్తుంటాయి. లౌడ్ నెస్‌లా అనిపిస్తుంది. అయితే కొన్ని చోట్ల మాత్రం హాయిగా నవ్వుకునేలా సీన్లు పడతాయి. ఇంటర్వెల్‌కి ముందు వచ్చే కొన్ని సీన్స్ కామెడీని పుట్టిస్తాయి. హీరో, హీరోయిన్ జోడి ఫ్రెష్‌గా కనిపిస్తుంది. కానీ ఆ ఇద్దరి మధ్య సరైన ఎమోషనల్ సీన్స్ గానీ, వావ్ అనిపించే సన్నివేశాలు గానీ పడవు. ఏదో అలా సాగుతోందంటే.. సాగుతోంది అనేలా ఫస్ట్ హాఫ్ సాగుతుంది.

సెకండాఫ్ ఏమైనా ట్విస్ట్, టర్న్లు ఉంటాయి.. కాస్త సీరియస్‌గా సాగుతుంది.. అసలు కథ ఏంటి? అన్నది కనీసం సెకండాఫ్‌లో అయినా రివీల్ చేస్తాడని ఆడియెన్స్ ఎదురు చూస్తారు. కానీ అక్కడ కూడా కథ ట్రాక్ ఎక్కదు. ఎంత సేపు ఆ సిల్లీ జోక్స్, ఫోర్స్‌గా పుట్టించే కామెడీనే కనిపిస్తుంది. ఆ పోలీస్ ఆఫీసర్ పాత్రతో చేయించిన కామెడీ కూడా సహనానికి పరీక్షలానే ఉంటుంది. హీరో పాత్ర, హీరోయిన్ పాత్రల్లోనూ క్లారిటీ కనిపించదు. అసలు ప్రేమ కథలో ఉండాల్సిన ఓ ఎమోషన్, గుండెల్ని కట్టి పడేసే సంఘర్షణ, మనసుని హత్తుకునేలా ఫీల్ ఏదీ కూడా ఇందులో కనిపించదు. క్లైమాక్స్ బ్లాక్ అంతా కూడా ఫన్నీగా రాసుకున్నాడని, అందుకే అనుదీప్ కేవీని తీసుకు వచ్చారని అర్థం అవుతుంది. క్లైమాక్స్ కొంత వరకు జెన్యూన్‌గా నవ్వులు పూయించినట్టు అనిపిస్తుంది.

టెక్నికల్‌గా చూసుకుంటే విజువల్స్ బాగుంటాయి. బీజీఎం కంటే.. పాటలు చాలా హృద్యంగా అనిపిస్తాయి. తెరపై పాటల్ని చూస్తుంటే ఎంతో ప్లెజెంట్‌గా కనిపిస్తాయి. ఎడిటింగ్ బాగుంటుంది. లొకేషన్స్ కూడా ఎక్కువగా లేకుండా.. ఉన్నంత వరకు బాగా చూపించారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ రిచ్‌గా ఉంటాయి. కథకు కావాల్సినంత ఖర్చు పెట్టినట్టుగా కనినిపిస్తుంది.నటీనటుల విషయానికి వస్తే మాత్రం సుమంత్ ఫ్రెండ్ పక్కింటి అబ్బాయిలానే ఎంతో సహజంగా కనిపిస్తాడు. అనంతిక ఉన్నంత వరకు తెరపై ఓ ప్లెజెంట్ ఫీలింగ్ వస్తుంది. ఈ మూవీకి ఫ్రెండ్స్ గ్యాంగ్ హైలెట్‌గా నిలుస్తుంది. అందులోనూ నరేంద్ర గురించి చెప్పుకోవాల్సిందే. అతను కనిపించే తీరు, అతని డైలాగ్ డెలివరీ నవ్వులు పూయిస్తుంది. మిగిలిన వారంతా కూడా బాగానే నవ్విస్తారు. పోలీస్ ఆఫీసర్‌గా ఉపేంద్ర లిమాయే ఉన్నంత వరకు నవ్వించే ప్రయత్నం చేస్తాడు. మిగిలిన పాత్రలు అంతగా ఇంపాక్ట్ చూపించవు.ఎదిగీఎదగని.. ఓ ఇమ్మెచ్యూర్.. నిబ్బానిబ్బిలానే హీరో హీరోయిన్లు తెరపై కనిపిస్తారు. పాత్రల్నే అలా రాసుకున్నట్టుగా, కథనే అలా డీల్ చేసినట్టుగా కనిపిస్తోంది. చాలా చోట్ల జెన్ జీ ని రిఫర్ చేసుకున్నాడు డైరెక్టర్. బహుషా తలాతోక లేనట్టుగా అనిపించే ఈ మూవీ జెన్ జీ ఆడియెన్స్‌కి నచ్చితే నచ్చొచ్చు. కొన్ని పాటలు, కొంత కామెడీ చాలు అనుకుంటే మాత్రం 'రోమాంచకం' ఓ ఆప్షన్‌గా పెట్టుకోవచ్చు. చివరగా ఈ సినిమాకి పెట్టుకున్న క్యాప్షన్స్‌లో చెప్పాలంటే.. గోరంత ప్రేమ, కొండంత హాస్యం, పిసరంత ఉత్కంఠ.

కొండా వివాదం.. సునామీయేనా

హైదరాబాద్, సెప్టెంబర్ 3, పెన్ పవర్: తెలంగాణ మంత్రివర్గంలో మునుపెన్నడూ లేని విధంగా రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించడం దాదాపు ఖాయమైనట్లేనని గాంధీ భవన్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీ పర్యటనలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మల్లికార్జున ఖర్గేలతో భేటీ అయి పార్టీ క్రమశిక్షణ, మంత్రి వైఖరిపై స్పష్టమైన సమాచారం అందించినట్లు తెలుస్తోంది. అయితే, ఆమె చేత ముందే రాజీనామా చేయించాలా లేక రాబోయే కేబినెట్ విస్తరణలో భాగస్వామ్య మార్పుగా చూపి గౌరవంగా పక్కన పెట్టాలా అనే అంశంపైనే అధిష్టానం కసరత్తు చేస్తోంది.ఈ వివాదానికి ప్రధాన కారణం మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత కాంగ్రెస్ నాయకత్వం , సీఎం రేవంత్ రెడ్డి ని లక్ష్యంగా చేసుకుని చేసిన తీవ్రమైన వ్యాఖ్యలే . ఇప్పటికే టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ ఈ వ్యవహారంపై నివేదికను సేకరించి అధిష్టానానికి నివేదించింది. కేవలం ఒక బీసీ మహిళా మంత్రిపైనే వేటు వేస్తే సమాజంలో లేదా పార్టీ వర్గాల్లో ప్రతికూల సంకేతాలు వెళ్తాయనే భావనతో, ఈ మార్పును కేవలం సురేఖ తొలగింపుగా కాకుండా పూర్తి స్థాయి కేబినెట్ పునర్వ్యవస్థీకరణగా చూపించేందుకు కాంగ్రెస్ పెద్దలు వ్యూహరచన చేస్తున్నారు.మరోవైపు, ఈ పరిణామాలను కొండా దంపతులు తేలిగ్గా తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. తాము దశాబ్దాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించామని, తమను కేబినెట్ నుంచి ఏకపక్షంగా తొలగిస్తే ఊరుకునేది లేదని వారు పరోక్ష హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఒకవేళ బలవంతంగా పదవి నుంచి తప్పిస్తే, ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి వరంగల్ ఈస్ట్ స్థానానికి ఉపఎన్నిక తీసుకువచ్చే ధోరణిలో వారు ఉన్నట్లు తెలుస్తోంది. ఇది జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్త చిక్కులు తెచ్చిపెట్టడం ఖాయం. కాంగ్రెస్ అధిష్టానానికి ఇది అత్యంత క్లిష్టమైన సమస్యగా మారింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన బలమైన నాయకురాలిగా ఉన్న కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే, ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ బీసీ వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని విమర్శించే అవకాశం ఉంది. ఈ రాజకీయ నష్టాన్ని భర్తీ చేసేందుకే మన్నూర్ కాపు సామాజిక వర్గానికే చెందిన విప్ ఆది శ్రీనివాస్ లేదా ఇతర సీనియర్ బీసీ నేతలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఈ కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ వంటి ఇతరుల ప్రవేశంపై కూడా ఊహాగానాలు సాగుతుండటంతో, కేవలం ఒకే మంత్రిని టార్గెట్ చేశారనే భావనను తగ్గించేందుకు అధిష్టానం శ్రమిస్తోంది. అయితే కొండా దంపతుల తిరుగుబాటు నైజం తెలిసిన కాంగ్రెస్ పెద్దలు, ఆమెను అసంతృప్తికి గురికాకుండా ఇతర కీలక నామినేటెడ్ పోస్టుతో నచ్చజెప్పే ప్రయత్నాలు కూడా సమాంతరంగా సాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి తన పాలనాపరమైన, పార్టీ పరమైన పట్టును నిరూపించుకోవడానికి ఈ నిర్ణయం కీలకంగా మారింది. ఒకవేళ కొండా సురేఖను కేబినెట్ నుంచి తప్పించి, ఆమె తిరుగుబాటు బావుటా ఎగరేస్తే తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు రచ్చకెక్కడం ఖాయం. రాబోయే ఢిల్లీ నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.

మెట్ట ప్రాంతం లో మత్తు ఇంజెక్షన్ల విక్రయం కలకలం

హైదరాబాద్ పెన్ పవర్: మత్తు కోసం ట్రెమడాల్ ఇంజెక్షన్లను వినియోగిస్తున్న యువత
జంగారెడ్డిగూడెం సమీపంలోని పామాయిల్ తోటలో వాడేసిన ఇంజెక్షన్లను గుర్తించిన వైనం
జంగారెడ్డిగూడెం

వైద్య అవసరాలకు మాత్రమే వినియోగించాల్సిన ట్రెమడాల్ ఇంజెక్షన్లను (నార్కోటిక్స్ మందులు) మత్తు పదార్థాలుగా వాడేందుకు అలవాటుపడ్డ యువతకు అడ్డగోలుగా విక్రయిస్తున్న వైనాన్ని ఈగల్ బృందం గుట్టురట్టు చేసింది... జంగారెడ్డిగూడెం లోని పలు మెడికల్ షాపులలో భారీ స్థాయిలో ఈ నార్కోటిక్ ను విక్రయిస్తున్నట్లు తనిఖీలలో తేలింది. ఈగల్ టీం,ఏలూరు డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో విచారణ ముమ్మరంచేసారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

కాంగ్రెస్ వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన గళం.. రోడ్డెక్కిన గులాబీ శ్రేణులు

కాంగ్రెస్ వైఫల్యాలపై బిఆర్ఎస్ శ్రేణుల నిరసన

గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 3:కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ సెంటర్ లో భారీ ధర్నా నిర్వహించారు.ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం' వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపుమేరకు ఇల్లందు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ సూచనలతో టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆంగోతు బిందు మాట్లాడుతూఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు.420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను ప్రజల ముందు ఉంచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ఎన్నికల హామీలను తక్షణమేనెరవేర్చాలని,లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ఆమె స్పష్టం చేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి రామారావు కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పానుగంటి రాధాకృష్ణ వీరారెడ్డి శంకర్ మురళి ఖదీర్ బాబా రాందాసు బాలు గణేష్ ఉమేష్ మోహన్ రావు అశోక్ శ్రీనాథ్ అనిల్ రవీందర్ రామారావు యాకూబ్ పాషా శ్రీను అంబయ్య వెంకట్ నరసింహ మురళి వంశీ శంకర్ మహేష్ ఖలీల్ శివ వెంకన్న సాయి తదితరులు పాల్గొన్నారు.

1000 రోజుల పరిపాలనపై కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

వెయ్యి రోజుల పాలనపై కాంగ్రెస్ నేతల సంబరాలు

గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 3: పదేళ్ల పింక్ పార్టీ పాలన కంటే వెయ్యిరోజుల ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్ పాలన భేష్ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య పిఎసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ఆదేశాల మేరకు గురువారం గార్ల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు తొలుత బాణాసంచా కాల్చి స్వీట్లను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు అనంతరం ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి పాలనను అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పేదలకు ఉచిత సన్న బియ్యం రేషన్ కార్డులు స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇందిరమ్మ ఇల్లు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు ప్రజలంతా గత పాలనలో ప్రస్తుత పాలనలో తమకు అందిన సంక్షేమాన్ని బ బేరీజు వేసుకొని ఆలోచించాలని సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా గార్ల రాంపురం మధ్య పాకాల ఏటిపై వంతెన నిర్మాణం పూర్తి కాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వేను వెంటనే వంతెన పనులను పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టడంతో పాటు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మకుండా ప్రజలకు మేలు చేసే ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి హతిరాం నాయక్ ఇల్లందు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భుక్యా నాగేశ్వరరావు గార్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు గంగావత్ రామ్ సింగ్ మర్రిగూడెం సర్పంచ్ భూక్య రాంసింగ్ చిన్న బంజర సర్పంచ్ మోతిలాల్ ముల్కనూర్ సర్పంచ్ వెంకటరావు సీతంపేట సర్పంచ్ వీర్య నాయక్ చిన్న కిష్టాపురం సర్పంచ్ వీరభద్రం గార్ల ఉపసర్పంచ్ మొహమ్మద్ జరీనా బేగం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శంషాద్ బేగం జిల్లా నాయకులు కట్ట శ్రీనివాస్ యాకుబ్ పాషా కత్తుల ప్రశాంత్ కోల కుమార్ గౌడ్ మోహిన్ అజ్మీరా బస్సీలాల్ మండల రవి గౌడ్ మల్లిబాబు పాలేరు వెంకటేశ్వర్లు వార్డు సభ్యులు సారయ్య తోడేటి శ్రీనివాస్ గౌడ్ రావుజి కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీరన్న సేవలు చిరస్మరణీయం

నివాళులు అర్పిస్తున్న నాయకులు

మాట్లాడుతున్న సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న

గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 3: సీపీఐ సీనియర్ నాయకుడు, ఉద్యమ సహచరుడు ఎల్లంకి వీరన్న మృతి పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి, తీరని లోటని సీపీఐ గార్ల మండల కార్యదర్శి జంపాల వెంకన్న అన్నారు. గార్ల మండల పరిధిలోని ముల్కనూరు గ్రామంలో గురువారం సీపీఐ శాఖ కార్యదర్శి శివ అధ్యక్షతన నిర్వహించిన వీరన్న సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వీరన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జంపాల వెంకన్న మాట్లాడుతూ ఈ ప్రాంత కమ్యూనిస్టు ఉద్యమంలో ఎల్లంకి వీరన్న పాత్ర మరువలేనిదన్నారు. ముల్కనూరు గ్రామంలో సీపీఐని బలోపేతం చేయడంలో ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. వృత్తి బాధ్యతలను నిర్వర్తిస్తూనే ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని, పేదలు, కూలీలు, రైతులు, కార్మికుల సమస్యలపై ఎల్లప్పుడూ స్పందించేవారని గుర్తుచేశారు.ముల్కనూరు లోని పెత్తందారీ వ్యవస్థ, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలను, ముఖ్యంగా యువతను చైతన్యవంతం చేయడంలో వీరన్న కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కష్టకాలంలోనూ పార్టీ జెండాను వీడకుండా ప్రజల పక్షాన నిలిచిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గం, ఉద్యమం పట్ల ఆయనకున్న నిబద్ధత భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు.వీరన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. వీరన్న కుటుంబ సభ్యులకు సీపీఐ గార్ల మండల సమితి తరఫున ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జంపాల విశ్వ, ముల్కనూరు సర్పంచ్ సిద్ధబోయిన వెంకట్రావు, బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, తెలంగాణ జనసమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు, సీపీఐ మండల నాయకులు మాగం లోకేష్, బండి శంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు అందనాల రాజీవ్, మద్దివంచ మాజీ ఉపసర్పంచ్ లావుడ్య భీముడు, ధారావత్ వీరన్న, సోమయ్య, జంపన్న తదితరులు పాల్గొన్నారు.

సూరారం ఆర్‌జికేలో రోడ్డు పనులను ప్రారంభించిన బీఆర్ఎస్ నేత వారాల వినోద్ కుమార్..

సూరారం ఆర్‌జికేలో.. రోడ్డు పనులకు శ్రీకారం..

- బీఆర్ఎస్ సీనియర్ నేత వారాల వినోద్ చేతుల మీదుగా పనుల ప్రారంభం..
- ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద గౌడ్ చొరవతో పనులు ప్రారంభించామన్న వినోద్..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 3:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 292 సాయిబాబా నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీలోని రాజీవ్ గృహకల్పలో, 1 నుంచి 14వ బ్లాక్ వరకు రోడ్డు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కే.పీ వివేకానంద గౌడ్ చొరవతో మంజూరైన ఈ పనులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమ నేత, వారాల వినోద్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ.. సాయిబాబా నగర్ 292 డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే కే.పీ.వివేకానంద గౌడ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.. సూరారం ఆర్‌జికే గృహకల్ప వాసులు చిరకాలంగా ఎదురుచూస్తున్న ఈ రోడ్డు సమస్యకు పరిష్కారం లభించడం సంతోషకరమన్నారు.. రాబోయే రోజుల్లో కాలనీలోని మిగిలిన సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తామని వినోద్ కుమార్ హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ ముదిరాజ్, రంగప్ప, భాస్కర్, మైత్రి నగర్ రాజు యాదవ్, బద్రి, జై సింహ రెడ్డి, గాజుల మాధవి, రాగుల పాండు, ఎరుకల అంజి, మంగళ సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు..

- ఆర్‌జికే బ్లాక్ నెం.1 నుంచి 14వ బ్లాక్ వరకు అభివృద్ధి పనులకు శ్రీకారం..
- ఎమ్మెల్యే చొరవ, సీనియర్ నేత వారాల వినోద్ కుమార్ కృషితో పనులు..
- ఏళ్ళతరబడి ఉన్న రోడ్డు సమస్య ఎట్టకేలకు పరిష్కారం..
- సాయిబాబా నగర్ డివిజన్ అభివృద్ధికి సమస్యల పరిష్కారానికీ ఎమ్మెల్యే హామీ..

పనుల ప్రారంభోత్సవంలో కొబ్బరికాయ కొడుతున్న స్థానికులు..

పనుల ప్రారంభానికి కొబ్బరికాయ కొడుతున్న వినోద్ కుమార్..

పది రోజుల్లో 'సాగర్' నీటి విడుదలపై నిర్ణయం తీసుకోవాలి

-3 పేజి తరువాయి

కలిసి పాదయాత్ర చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఎన్ఎస్పీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన రైతు మహా ధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.

"మేము ధర్నా చేస్తామని అనగానే ప్రభుత్వానికి చలిజ్వరం వచ్చింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా మూడు పంటలకు నీళ్లిచ్చాం. రైతుబంధు ఎప్పటికప్పుడు రైతు ఖాతాల్లో జమచేశాం. నిరంతరాయంగా విద్యుత్తు అందించాం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో మాత్రం సాగర్ పరీవాహక ప్రాంతాల్లో సాగునీరు లభ్యం కావడం లేదు. మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారు. కౌలు రైతులకు రైతు భరోసా లేదు. కేసీఆర్ పాలనలో మిర్యాలగూడ రైస్‌బౌల్ ఆఫ్ తెలంగాణగా నిలిస్తే నేడు సాగు చేసేందుకు నీటి నిల్వలు లేక రైతు మహాధర్నా నిర్వహించాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ పేరిట 33 హామీలు ఇచ్చారు. కానీ మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టి, రైతులకు రుణమాఫీ ద్రోహం చేశారు.

సాగర్‌లో నీళ్లున్నా మంత్రులకు సోయి లేదు

శ్రీశైలం ప్రాజెక్టులో 537 అడుగుల నీళ్లున్నా నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు కన్నీటిని తెప్పిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏవేవో మాట్లాడుతున్నారు. జిల్లాలోని వీరిద్దరికీ రైతుల సమస్యలపై ఎలాంటి సోయి లేదు. నాగార్జునసాగర్‌లో 180 టీఎంసీల నీళ్లున్నా ఎడమకాల్వ ఆయకట్టుకు ఎందుకు ఇవ్వడంలేదు. నికర జలాలున్నప్పటికీ వరద జలాలపై ఆధారపడ్డ ఆంధ్రప్రదేశ్‌లోని వెలిగొండ, పోతిరెడ్డి ప్రాజెక్టులకు నీటిని ఏపీ సీఎం చంద్రబాబు తరలించుకుపోతుంటే కళ్లప్పగించి చూస్తున్నారు. సెప్టెంబరు 7 నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అసెంబ్లీలోనూ ప్రభుత్వం స్పందించకపోతే వినాయకచవితి తర్వాత నాడు కేసీఆర్ చేసిన పాదయాత్ర మాదిరిగా కోదాడ నుంచి హాలియా వరకు రైతులతో కలిసి పాదయాత్ర చేపడతా" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను డిజిటల్ తెరలపై ప్రదర్శించారు.

ఏ హక్కులేని ఏపీ నీటిదోపిడీ: జగదీశ్‌రెడ్డి

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ సాగర్ ప్రాజెక్టుపై ఏ హక్కులేని ఏపీ ప్రభుత్వం కుడికాల్వ నీళ్లు దోచుకుంటుంటే ఎడమ కాల్వ రైతులు ప్రధానంగా నల్గొండ, ఖమ్మం జిల్లాల వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బాధిత రైతులు తమ ఆవేశాన్ని మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిలపై చూపించి నీటిని సాధించాలన్నారు. నాడు కేసీఆర్ పాదయాత్ర చేసి నాటి సీఎం చంద్రబాబు మెడలు వంచి సాగర్ నీరు విడుదల చేయించినట్లుగా.. కేటీఆర్ సైతం నేడు పాదయాత్ర చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, పార్టీ నాయకులు బడుగుల లింగయ్య యాదవ్, నల్లమోతు భాస్కర్‌రావు, రవీంద్రనాయక్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్ కుమార్, నోముల భగత్, తిప్పన విజయసింహారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాకేశ్‌రెడ్డి, సిద్ధార్థ, ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి రోజుల పాలన నాణానికి అటు..ఇటు

హైదరాబాద్, సెప్టెంబర్ 3 పెన్ పవర్:
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టి వెయ్యి రోజుల మైలురాయిని చేరుకుంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కారు పాలనా సంస్కరణలు, సంక్షేమ పథకాలు, భవిష్యత్ ప్రణాళికలతో సరికొత్త రాజకీయ ఒరవడిని సృష్టిస్తోంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనను దాటుకుని అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు.. అటు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తూనే, ఇటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టే ద్వంద్వ వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2025–26 నాటికి రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కి చేరి జాతీయ సగటు కంటే 91 శాతం అధికంగా నమోదు కావడం ద్వారా తమ ఆర్థిక క్రమశిక్షణను కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద, ప్రజల ముందు గట్టిగా చాటుకుంటోంది.రాష్ట్రంలో కీలకమైన గ్రామీణ, రైతు ఓటుబ్యాంకును నిలుపుకోవడమే లక్ష్యంగా రేవంత్ సర్కారు కీలక నిర్ణయాలు అమలు చేసింది. 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయడంతో పాటు, రైతు భరోసా కింద రూ. 36,000 కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడం, గత యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 81.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం ద్వారా విపక్షాల విమర్శలకు చెక్ పెట్టింది.మహిళా సాధికారత ద్వారా శాశ్వత ఓటుబ్యాంకును నిర్మించుకునే క్రమంలో మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. ఇప్పటివరకు 335 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు జరగగా, పేద మహిళలకు సుమారు రూ. 11,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయి. దీనికితోడు 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లకు ఒక్కో లబ్ధిదారునికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, 15 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ ద్వారా మొత్తం 3.38 కోట్ల మందికి ఆహార భద్రత కల్పించడం రేవంత్ రాజకీయ పునాదిని మరింత బలోపేతం చేశాయి.కులగణన సర్వే నిర్వహణ, ఎస్సీ వర్గీకరణ అమలు, విద్య -- ఉద్యోగాలు -- రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను అసెంబ్లీలో ఆమోదింపజేయడం ద్వారా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సంప్రదాయ బహుజన సామాజిక సమీకరణాలను తిరిగి జోడించే వ్యూహాత్మక రాజకీయ అడుగు వేశారు. నిరుద్యోగుల అసంతృప్తి గత ప్రభుత్వ ఓటమికి కారణమన్న స్పృహతో.. డీఎస్సీ ద్వారా 10,006 ఉపాధ్యాయ కొలువులతో సహా మొత్తం 72,000కు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారు. 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 65 ఐటీఐలు, 57 పాలిటెక్నిక్ కళాశాలలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా మార్చడంతో పాటు యంగ్ ఇండియా స్కిల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీలను తెరపైకి తెచ్చారు. విద్యా ప్రమాణాల సూచీలో తెలంగాణను 28వ స్థానం నుంచి 18వ స్థానానికి తీసుకెళ్లారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం, కొత్తగా 2,000 పడకల ఉస్మానియా ఆస్పత్రి, 3 టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం, డ్రగ్స్‌పై పోరుకు ఈగల్, కల్తీ నిరోధానికి టీజీ–సేఫ్, మండల స్థాయికి ప్రజావాణి విస్తరణ వంటివి పరిపాలనపై పట్టును చాటాయి.ఇక అభివృద్ధి రంగంలో 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డు, 6,092 కి.మీ హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రోడ్లు, 122.9 కి.మీ మేర హైదరాబాద్ మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం ద్వారా బ్రాండ్ హైదరాబాద్‌ను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. టీజీ–ఐపాస్ ద్వారా రూ. 1.29 లక్షల కోట్ల పెట్టుబడులు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025 ద్వారా రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్, భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ హబ్‌ల దిశగా రేవంత్ సర్కారు దూకుడు పెంచింది.మొత్తంగా చూస్తే.. మొదటి వెయ్యి రోజుల్లో సంక్షేమ పథకాలు, భారీ మౌలిక వసతుల ద్వారా ప్రభుత్వం మైలేజ్ సాధించినప్పటికీ, పెరిగిన సంక్షేమ వ్యయం, నిధుల సర్దుబాటు, ప్రాజెక్టుల భూసేకరణ, అమలులో వేగం వంటివి రానున్న రోజుల్లో రేవంత్ ప్రభుత్వానికి ప్రధాన రాజకీయ, ఆర్థిక సవాళ్లుగా నిలవనున్నాయి. ఈ వెయ్యి రోజుల ప్రగతి రేవంత్ రెడ్డి నాయకత్వానికి పార్టీలోనూ, రాష్ట్ర రాజకీయాల్లోనూ ఎదురులేని ఆధిపత్యాన్ని తెచ్చిపెడుతుందా లేదా అనేది విపక్షాల ప్రతిఘటన, రాబోయే ఫలితాలే తేల్చనున్నాయి. తమ పాలనలోని విజయాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నివేదికలు విడుదల చేస్తూ, ప్రచారం చేసుకుంటోంది. మరోవైపు, ఈ వేడుకల మూడ్‌ను దెబ్బతీసేలా ప్రతిపక్ష బీఆర్ఎస్ సానుభూతిపరులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలోకి దిగారు. కేవలం సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించడానికే పరిమితం కాకుండా, ప్రభుత్వంపై ఉన్న ప్రజా వ్యతిరేకతను నేరుగా వీధుల్లోకి తెచ్చేందుకు పోస్టర్ల దాడికి శ్రీకారం చుట్టారు.రాష్ట్రంలోని ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వెలిసిన వ్యంగ్యాత్మక కార్టూన్ పోస్టర్లు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. 6 గ్యారెంటీలు, రైతు భరోసా, ఉద్యోగాల భర్తీ వంటి అంశాలపై వ్యంగ్యాస్త్రాలు విసురుతూ రాత్రికి రాత్రే ఈ పోస్టర్లను ప్రత్యక్షం చేస్తున్నారు. విశేషమేమిటంటే.. ఈ పోస్టర్లలో ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ పేరు గానీ, గుర్తులు గానీ ముద్రించడం లేదు. అధికార పార్టీపై ఇలా పోస్టర్లు వేయగలిగేది బీఆర్ఎస్ శ్రేణులేనని స్పష్టమవుతున్నా, పేరు లేకుండా .. కేసుల్లేకుండా చూసుకుంటున్నారు.దీనికి కౌంటర్ ఇచ్చేందుకు కాంగ్రెస్ శ్రేణులు కూడా అదే శైలిని ఎంచుకున్నాయి. మిర్యాలగూడ వంటి కీలక నియోజకవర్గాలతో పాటు పలు పట్టణాల్లో పదేళ్ల బీఆర్ఎస్ పాలనా కాలంలో జరిగిన అక్రమాలు, కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, ఆర్థిక లోటును ఎత్తిచూపుతూ ఎదురు పోస్టర్లు దర్శనమిస్తున్నాయి. బిఆర్ఎస్ కౌంటర్ వేస్తే తాము రీ–కౌంటర్ వేస్తామనే తరహాలో కాంగ్రెస్ వైపు నుంచి కూడా పోటీగా పోస్టర్లు వెలుస్తున్నాయి. రెండు ప్రధాన పార్టీలు పోస్టర్ల యుద్ధాన్ని వీధుల దాకా తెచ్చినా, తామే స్వయంగా ఈ పోస్టర్లు వేయిస్తున్నామని ఎవరూ బహిరంగంగా ప్రచారం చేసుకోవడం లేదు.ఈ పోస్టర్ వార్ రెండు పార్టీల ముసుగు లేని రాజకీయ పోరాటానికి అద్దం పడుతోంది. తమ అధికారిక ముద్ర పడకుండా పోస్టర్ల ద్వారా మైండ్ గేమ్‌లు ఆడటం, ప్రజల్లో చర్చను రేకెత్తించడం ఇరు వర్గాల వ్యూహకర్తల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ఒకరి వైఫల్యాలను మరొకరు రచ్చకెక్కించే ఈ ప్రక్రియలో ముద్రణకర్తల పేర్లు లేకున్నా, రాజకీయ సందేశం మాత్రం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

తమిళనాడు నుంచి ఏపీకి మరో భారీ ప్రాజెక్టు? కాకినాడలో హెచ్‌డీ హ్యుందాయ్ షిప్‌యార్డ్!

రాష్ట్రం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పారిశ్రామిక పెట్టుబడుల ఆకర్షణలో దూకుడుగా అడుగులు వేస్తోంది. పారిశ్రామికవేత్తలకు మెరుగైన రాయితీలు కల్పిస్తూ, వ్యాపార అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో తమిళనాడు రాష్ట్రంలో నిర్మించాల్సిన ఒక ప్రతిష్టాత్మకమైన భారీ ప్రాజెక్టు ఇప్పుడు ఏపీ వైపు దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. తమిళనాడులోని తూత్తుకూడిలో నిర్మించాలని తొలుత ప్రతిపాదించిన 'హెచ్‌డీ హ్యుందాయ్ షిప్‌యార్డ్' ఆంధ్రప్రదేశ్‌కు తరలించాలని ఆ సంస్థ యాజమాన్యం ఆలోచిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈ భారీ ప్రాజెక్టు కోసం కాకినాడలో స్థలాన్ని పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. తమిళనాడుతో పోలిస్తే ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్ అందిస్తామని ఏపీ ప్రభుత్వం ఆఫర్ చేయడంతోనే హెడ్ హ్యుందాయ్ యాజమాన్యం ఏపీ వైపు చూస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఈ ప్రాజెక్టును కాకినాడ రప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగిందని, కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరుపుతోందని చెబుతున్నారు. రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టు ఆధారిత అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని అంటున్నారు. ఇందులో భాగంగానే షిప్‌యార్డ్ – సముద్ర ఆధారిత పరిశ్రమల దిగ్గజాలను రాష్ట్రానికి ఆకర్షించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని చెబుతున్నారు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రాంతానికి యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు రావడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నిదర్శనంగా నిలిచింది. దానిని కొనసాగిస్తూ, ఇప్పుడు హెచ్‌డీ హ్యుందాయ్ షిప్‌యార్డ్ లాంటి అంతర్జాతీయ ప్రాజెక్టును కూడా ఏపీకి తీసుకురావడానికి ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోందని అంటున్నారు. ఈ ప్రయత్నాలు గనుక సఫలమైతే, ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మేటి పారిశ్రామిక, తయారీ రంగ హబ్‌గా రూపాంతరం చెందడంలో ఎలాంటి సందేహం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. షిప్‌యార్డ్ నిర్మాణం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. మొత్తంగా, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న చొరవ, పారిశ్రామిక అనుకూల విధానాల వల్ల ఏపీ భవిష్యత్తులో దేశంలోని ప్రముఖ పెట్టుబడుల గమ్యస్థానంగా నిలవనుంది.

ఆ శాఖకు మంత్రయితే .. అంతే సంగతులు

తెలంగాణ అటవీ, దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశించింది. ఆమె తన పదవికి రాజీనామా చేయకుంటే మంత్రి వర్గం నుండి బర్తరఫ్ చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేసిన వారికి పదవీగండం తప్పదని, లేదా రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొంటారన్న అంశం మరోసారి ప్రచారంలోకి వచ్చింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో దేవాదాయ శాఖ మంత్రులుగా పనిచేసిన వారి రాజకీయ ప్రగతి ఆశించిన స్థాయిలో సాగలేదు. రాజకీయ వత్తిళ్లు, వివాదాలు, పార్టీలు మారడం జరుగుతూ వస్తుంది. 2023లో దేవాదాయ శాఖా మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖ నాగార్జున, కేటీఆర్ మీద వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, నేరుగా రేవంత్ రెడ్డి మీద ఆమె కూతురు చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆమె పదవి నుండి తప్పుకోవాల్సిన పరిస్థితి ఎదురయింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో 1999 - 2004 కాలంలో దేవాదాయ మంత్రిగా పనిచేసిన దండు శివరామరాజు ఆ తర్వాత రాజకీయాల్లో పెద్దగా రాణించకుండానే 2010లో కన్నుమూశారు. తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తర్వాత 2014లో చంద్రబాబు మంత్రి వర్గంలో దేవాదాయ మంత్రిగా పనిచేసిన పైడికొండల మాణిక్యాల రావు టీడీపీ - బీజేపీ కూటమి సంబంధాలు తెగిపోయిన నేపథ్యంలో 2018 మార్చిలో రాజీనామా చేశారు. ఆ తర్వాత కోవిడ్ సమయంలో మరణించారు. 2018 - 2019 కాలంలో ఏపీలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేసిన కేఈ కృష్ణమూర్తి ఆ తర్వాత రాజకీయాల్లో పెద్దగా రాణించలేదు. వైసీపీ ప్రభుత్వంలో 2019 - 2022 మధ్య కాలంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేసిన వెల్లంపల్లి శ్రీనివాస్ వివిధ ఆరోపణల నేపథ్యంలో పదవిని కోల్పోయారు. ఆ తర్వాత పనిచేసిన కొట్టు సత్యనారాయణ ప్రభుత్వ మార్పిడితో 2024లో పదవిని కోల్పోయారు. సింహాద్రి సత్యనారాయణ, గాదె వెంకట్ రెడ్డి, సి.రామచంద్రయ్య, గంటా శ్రీనివాసరావు, గంగాధర్, ఎం సత్యనారాయణరావు, జె. రత్నాకర్ రావు, జేటీ రామారావు, కేవీ రమణారెడ్డి, ఎస్.గంగాధర్, మహిపాల్ రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జూపల్లి క్రిష్ణారావు తదితరులు దేవాదాయ శాఖ మంత్రులుగా పనిచేసి ఒడిదుడుకులు ఎదుర్కొన్న వారే కావడం గమనార్హం. కొండా సురేఖ వివాదం నేపథ్యంలో దేవాదాయ శాఖ మంత్రుల రాజకీయ భవితవ్యం వ్యవహారం మరోసారి చర్చకు వచ్చింది.

అమెరికాలో ఉన్న తెలుగు కుటుంబాలకు ఈ ఘటన ఓ హెచ్చరిక

అమెరికాలో నివసిస్తున్న ఓ తెలుగు కుటుంబానికి ఊహించని చేదు అనుభవం ఎదురైనట్లు తెలుస్తోంది. మేరీల్యాండ్‌లో భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్న ఓ తెలుగు మహిళ.. తమతో పాటు ఇంట్లో ఉంటున్న ఇద్దరు స్నేహితులపై అనుమానం రావడంతో ఇంటిని పరిశీలించగా షాకింగ్ విషయం బయటపడినట్లు సమాచారం. ఇంట్లోని ప్రైవసీకి భంగం కలిగించేలా రహస్య కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆమె ఆరోపించిన ఘటన ప్రస్తుతం కలకలం రేపుతోంది.

స్నేహితులనే నమ్మితే.. ఇలాంటి షాక్

తెలుగువారిలో చాలామంది అమెరికాలో ఉద్యోగాలు, చదువులు, ఇతర కారణాలతో వెళ్లిన తర్వాత ఖర్చులను తగ్గించుకునేందుకు స్నేహితులతో కలిసి ఇళ్లు షేర్ చేసుకుంటుంటారు. ఇదే విధంగా మేరీల్యాండ్‌లోని ఓ ఇంట్లో తెలుగు దంపతులు తమ ఇద్దరు పిల్లలతో పాటు మరో ఇద్దరు పురుష స్నేహితులతో కలిసి నివసిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కొంతకాలం తర్వాత ఆ మహిళకు ఇంట్లో ఏదో అనుమానాస్పదంగా జరుగుతోందన్న భావన కలిగిందని చెబుతున్నారు. దీంతో ఆమె తన ఫోన్‌లో హిడెన్ కెమెరాలను గుర్తించే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇంట్లోని వివిధ ప్రాంతాల్లో తనిఖీ చేసినట్లు సమాచారం.

గోడలు, లగేజీ.. ఎక్కడ చూసినా కెమెరాలే?

ఇంటిని పరిశీలించే సమయంలో దాదాపు 13 రహస్య కెమెరాలు ఉన్నట్లు గుర్తించినట్లు ఆమె వెల్లడించినట్లు సమాచారం. వాటిని ఇంటి గోడల లోపల, లగేజీతో పాటు ఇతర ప్రదేశాల్లో అమర్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తమకు తెలియకుండా ఇంత పెద్ద సంఖ్యలో కెమెరాలు ఏర్పాటు చేయడం ఆమెను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని చెబుతున్నారు. తమతో కలిసి ఉంటున్న వ్యక్తులే ఇలా చేశారనే అనుమానం రావడంతో కుటుంబం తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు సమాచారం. ముఖ్యంగా ఇద్దరు పిల్లలు ఉన్న కుటుంబంలో ఇంటి లోపలే ప్రైవసీకి భంగం కలగడం మరింత కలవరపెట్టే అంశంగా మారింది.

మానసికంగా తీవ్ర ప్రభావం

ఈ ఘటన తర్వాత ఆ మహిళ తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు తెలుస్తోంది. తనకు ఎదురైన అనుభవం కారణంగా తాను తీవ్రంగా కుంగిపోయానని, ఒక దశలో ఆత్మహత్య ఆలోచనలు కూడా వచ్చినట్లు ఆమె పేర్కొన్నట్లు సమాచారం. ప్రస్తుతం మానసికంగా కోలుకునేందుకు సుమారు 40 రోజుల పాటు భారత్‌కు వచ్చినట్లు తెలుస్తోంది. పరిస్థితులు చక్కబడిన తర్వాత తిరిగి అమెరికాకు వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

అమెరికాలో ఉన్న తెలుగు కుటుంబాలకు కీలక హెచ్చరిక

అమెరికాలో ఇతరులతో కలిసి ఇళ్లు షేర్ చేసుకునే కుటుంబాలకు ఇది ఒక ముఖ్యమైన హెచ్చరికగా చెప్పవచ్చు. ముఖ్యంగా భార్యాభర్తలు, పిల్లలు కలిసి నివసించే సమయంలో ఇంటి ప్రైవసీ, భద్రత విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. కొత్త ఇంటికి మారినప్పుడు బెడ్‌రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, డ్రెస్సింగ్ ఏరియాలు, స్మార్ట్ డివైజ్‌లు, అనుమానాస్పద వస్తువులు వంటి వాటిని ఒకసారి పరిశీలించడం మంచిది. అనుమానాస్పద కెమెరా లేదా రికార్డింగ్ పరికరం కనిపిస్తే దానిని నిర్లక్ష్యం చేయకుండా అవసరమైతే స్థానిక పోలీసులను సంప్రదించాలి.

స్నేహితులైనా, పరిచయస్తులైనా.. ఇంటి ప్రైవసీ విషయంలో మాత్రం అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. అయితే ఈ ఘటనకు సంబంధించిన ఆరోపణలు, బాధ్యులపై అధికారిక దర్యాప్తు లేదా చట్టపరమైన చర్యల వివరాలు ఇంకా తీసుకోలేదని తెలుస్తోంది. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

మానవ సంబంధాలు ముఖ్యం.. ఒంటరితనంపై అలర్ట్!



నలుగురిలో నవ్వే క్షణాలు తగ్గినా, ఒంటరిగా గడిపే గంటలు పెరిగినా అది మనసుకే కాకుండా శరీరానికి కూడా తీవ్ర ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ కాలం ఒంటరిగా జీవించడం వల్ల గుండె జబ్బులు, స్ట్రోక్, జ్ఞాపకశక్తి తగ్గడం వంటి తీవ్రమైన నరాల సంబంధిత వ్యాధులు వస్తాయని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఇష్టం లేని ఒంటరితనం మెదడు, రోగనిరోధక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున, మానవ సంబంధాల ప్రాముఖ్యతను తెలుసుకోవడం ఇప్పుడు చాలా అవసరం. ఆ వివరాలు చూద్దాం..

మెదడు, జ్ఞాపకశక్తిపై పడే ప్రతికూల ప్రభావం:

సుదీర్ఘకాలం పాటు సామాజిక సంబంధాలకు దూరంగా ఉండటం వల్ల ఆలోచనా సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే శక్తి క్రమంగా తగ్గుతాయి. రోజువారీ సంభాషణలు లేకపోతే మెదడుకు అందాల్సిన ఉత్తేజం తగ్గిపోతుంది. అంతేకాకుండా ఒంటరితనం వల్ల శరీరంలో 'కార్టిసోల్' అనే ఒత్తిడి హార్మోన్ పెరిగిపోతుంది. ఇక దీనివల్ల నిద్రలేమి, ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి మందగించడం వంటి సమస్యలు మొదలవుతాయి.

డిమెన్షియా ప్రమాదం, శారీరక నొప్పి:

ఇటీవలి అధ్యయనాలు ఒంటరితనాన్ని డిమెన్షియా వ్యాధికి ఒక ప్రధాన కారణమని చెబుతున్నాయి. మనం ఒంటరిగా ఉన్నప్పుడు మెదడులో కలిగే భావోద్వేగ బాధ, మనకు శారీరకంగా దెబ్బతగిలినప్పుడు వచ్చే నొప్పితో సమానంగా ఉంటుందని బ్రెయిన్ స్కాన్ పరీక్షల్లో తేలింది. ఇక స్ట్రోక్, పార్కిన్సన్స్ వంటి వ్యాధులతో బాధపడేవారికి ఒంటరితనం తోడైతే వారి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉంటుంది.

ధూమపానంతో సమానమైన డేంజర్:

సుమారు 30 లక్షల మందిపై జరిపిన విశ్లేషణ ప్రకారం, దీర్ఘకాలిక ఒంటరితనం వల్ల అకాల మరణ ముప్పు ఏకంగా 26 శాతం పెరుగుతుంది. ఆరోగ్య పరంగా చూస్తే ఇది ఊబకాయం, సిగరెట్లు తాగడం వల్ల కలిగే హానితో సమానమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక ఒంటరిగా ఉండేవారు అనారోగ్యకరమైన ఆహారం, మద్యం లేదా ఇతర వ్యసనాల వైపు త్వరగా ఆకర్షితులయ్యే అవకాశం కూడా ఉంటుంది.

బంధాలు పెంచుకోవడమే అసలైన పరిష్కారం:

ఈ సమస్యకు ముగింపు పలకాలంటే మన జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. సోషల్ మీడియా వాడకాన్ని తగ్గించి, నేరుగా మనుషులతో స్నేహాలను ప్రోత్సహించాలి. వందల మంది పరిచయస్థులు ఉండక్కర్లేదు, మనకంటూ కష్టసుఖాలు పంచుకునే కొద్దిమంది నమ్మకమైన వ్యక్తులు ఉన్నా చాలు. ఇక కొత్త విషయాలు నేర్చుకోవడం, వ్యాయామం చేయడం, కుటుంబ సభ్యులతో సమయం గడపడం ద్వారా మెదడును ఎప్పుడూ చురుగ్గా ఉంచుకోవచ్చు.

ఒంటరితనం అనేది కేవలం ఒక భావోద్వేగ సమస్య మాత్రమే కాదు, అది మన ఆయుష్షును తగ్గించే ఒక నిశ్శబ్ద శత్రువు. మన చుట్టూ ఉన్నవారితో బంధాలను బలపరచుకోవడం, కష్టసుఖాలు పంచుకోవడం ద్వారానే మనస్సును, మెదడును ఆరోగ్యంగా ఉంచుకోగలము. ఇక ఇప్పటికైనా డిజిటల్ లోకంలోంచి బయటకు వచ్చి, నిజమైన మానవ సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వడమే ఆరోగ్యకరమైన జీవితానికి పునాది.

సామన్య ప్రజల కళలకు దివ్యమైన దేవాలయం!

హాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ ..-స్టార్ వార్స్- రూపశిల్పి జార్జ్ లూకాస్ సృష్టించిన ప్రతిష్టాత్మక -లూకాస్ మ్యూజియం ఆఫ్ నరేటివ్ ఆర్ట్- ఎట్టకేలకు లాస్ ఏంజెల్స్‌లో ప్రారంభానికి సిద్ధమైంది. ప్రసిద్ధ సైన్స్ ఫిక్షన్ సిరీస్ -స్టార్ వార్స్- అభిమానులను ఆకట్టుకునే అంశాలు ఎన్నో ఉన్నా? ఈ మ్యూజియం కేవలం ఆ ఒక్క ఫ్రాంచైజీకి మాత్రమే పరిమితం కాదని లూకాస్ స్పష్టం చేశారు. సామాన్య ప్రజల కళలకు ఓ దివ్యమైన దేవాలయంగా, అరుదైన నరేటివ్ ఆర్ట్‌ను ఒకే చోట ఆవిష్కరించే అద్భుత వేదికగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు.

మ్యూజియం ఏర్పాటు వెనుక 17 ఏళ్ల సుదీర్ఘ శ్రమ .. ప్రయాణం ఉంది. గతంలో శాన్ ఫ్రాన్సిస్కో, షికాగో వంటి నగరాల్లో వేర్వేరు కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు. అయితే 82 ఏళ్ల జార్జ్ లూకాస్ తన భార్య మెలోడీ హాబ్సన్‌తో కలిసి ఎన్నో అడ్డంకులను అధిగమించి ఎట్టకేలకు లాస్ ఏంజెల్స్‌లోని ఎక్స్‌పోజిషన్ పార్క్‌లో దీనిని ఆవిష్కరించారు. అసాధ్యమైన విషయాలను సాధ్యం చేయడమే తనకు అలవాటని కానీ ఈ ప్రాజెక్ట్ తనను తీవ్రంగా శోధించిందని లూకాస్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

ఆర్కిటెక్ట్ మా యాన్సాంగ్ రూపొందించిన భవన నిర్మాణం ఒక అంతరిక్ష నౌకను తలపించే వినూత్న శైలిలో ఉంటుంది. మ్యూజియం ప్రధాన ల్యాబీలోనే -ది ఫాంటమ్ మెనాస్- సినిమాలోని పసుపు రంగు నబూ ఎన్-1 స్టార్‌ఫైటర్ సందర్శకులకు స్వాగతం పలుకుతుంది. అయినా? లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న గ్యాలరీలలో -స్టార్ వార్స్- వాటా కేవలం 7 శాతం మాత్రమే కావడం గమనార్హం. మిగిలిన భాగమంతా లూకాస్ .. ఆయన భార్య దశాబ్దాలుగా సేకరించిన అరుదైన చిత్రలేఖనాలు, కామిక్స్ ,పాపులర్ ఆర్ట్సే ఆక్రమించాయి. ఈ ప్రదర్శనశాలలో 20వ శతాబ్దపు ప్రముఖ చిత్రకారుడు నార్మన్ రాక్‌వెల్ చిత్రాలకు ప్రత్యేక స్థానం కల్పించారు. ముఖ్యంగా 1960లో నల్లజాతి చిన్నారి రూబీ బ్రిడ్జెస్ తెల్లవారి పాఠశాలలోకి అడుగుపెడుతున్న చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించిన -ది ప్రాబ్లమ్ వి ఆల్ లివ్ విత్- పెయింటింగ్ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటితో పాటు మ్యాక్స్‌ఫీల్డ్ పారిష్ వంటి ప్రముఖ కళాకారుల వర్ణచిత్రాలు, ఫ్రీడా కాలో, డీగో రివేరా, అండీ వార్హోల్ వంటి దిగ్గజాల సృష్టి కథన చిత్రాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేసేలా ఏర్పాటు చేశారు.

అలాగే పాతకాలపు వార్తాపత్రిక కామిక్స్, -ఫ్లాష్ గోర్డాన్-, -బక్ రోజర్స్- వంటి తొలి తరం కామిక్ స్ట్రిప్స్‌తో పాటు జపాన్ ఎనిమే, మాంగా ఆర్ట్ , చిన్నారుల విభాగాలు కూడా మ్యూజియంలో కొలువుదీరాయి. ఆర్ట్ గ్యాలరీలను కేవలం వర్గాలు లేదా కాలక్రమం ఆధారంగా కాకుండా క్రీడలు, సామాజిక పోరాటాలు, పౌరాణిక కథలు వంటి నిత్య జీవిత కోణాల ప్రాతిపదికన వర్గీకరించడం విశేషం. కథ చెప్పే ప్రతి కళాఖండానికి ఇక్కడ తగిన గౌరవం దక్కుతుందని క్యురేటర్లు తెలిపారు.

సెప్టెంబర్ 22న సాధారణ ప్రజలకు అందుబాటులోకి రానున్న మ్యూజియం పాప్ కల్చర్ .. కమర్షియల్ ఆర్ట్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపును తీసుకొస్తుందని భావిస్తున్నారు. సినిమా రంగానికి మాత్రమే కాకుండా దృశ్యరూప కథనాలకు (నరేటివ్ ఆర్ట్) లూకాస్ అందించిన కానుక భవిష్యత్తు తరాలకు గొప్ప స్ఫూర్తి కేంద్రంగా నిలవనుంది.

ఉల్లిపొరల సంక్షోభం!

1960వ దశకం నుంచీ భారత్ ఒక సమతూక కళను అభివృద్ధి చేసుకుంది. వినియోగదారులకు ఆహార ధరలు అందుబాటులో ఉంచుతూనే, రైతులకు గిట్టుబాటు ధరల హామీ ఇవ్వడం మధ్య సమతూకం సాధించడం, స్వల్పకాలిక ఒడిదొడుకులను నిర్వహించడంపైనే ప్రభుత్వ జోక్యం కేంద్రీకృతమై ఉండటం. అందుకే 2023 డిసెంబర్ నుంచి 2024 మే వరకు ఉల్లి ఎగుమతులను ప్రభుత్వం నిషేధించింది. ఆ తర్వాత టన్నుకు 550 డాలర్ల కనీస ఎగుమతి ధరతోపాటు 40 శాతం ఎగుమతి సుంకం విధించింది. 2024 సెప్టెంబర్‌లో ఆ సుంకాన్ని 20 శాతానికి తగ్గించి, చివరకు 2025 ఏప్రిల్‌లో పూర్తిగా రద్దు చేసింది. అయితే, అనూహ్య వాతావరణ పరిస్థితులతోపాటు దీర్ఘకాలిక ఉపశమన చర్యలు లేకపోవడం ఈ సమతూకపు ఆటను రోజురోజుకూ మరింత ఇబ్బందికరంగా మారుస్తోంది. రైతుల దృక్కోణం నుంచి చూస్తే, ఊహించిన ధర ఆధారంగా వారు కీలకమైన ఉత్పత్తి నిర్ణయాలు తీసుకున్న తర్వాత ప్రభుత్వం తరచూ తన వైఖరిని మార్చుకుంటూ వస్తోంది! మరోవైపు, రబీ పంట సమృద్ధిగా పండిన సమయంలో, దేశంలో ప్రధాన సరఫరాదారైన మహారాష్ట్రలోని ఉల్లి రైతులు, కేంద్రం నిర్ణయించిన కిలోకు రూ.12.35 సేకరణ ధర సాగు వ్యయాన్ని కూడా భరించదని వాదించారు. దీంతో కేంద్రం ఆ ధరను కిలోకు రూ.26.45 వరకూ పెంచింది. అయితే నాణ్యత లోపం, నిల్వ సదుపాయాల కొరతవంటి కారణాలతో అంతకుముందే కిలో రూపాయికే తెగనమ్ముకోవాల్సి వచ్చిన చాలామంది రైతులు.. ఈ పెరిగిన ధర ప్రయోజనాన్ని అందుకోలేకపోయారు. ధరలు కుప్పకూలిన తర్వాత జోక్యం చేసుకోవడం వల్ల కలిగే పరిమితులను, అది అన్ని రైతులకు లేదా అన్ని రకాల ఉత్పత్తికి చేరకపోవడాన్ని ఇది బహిర్గతం చేసింది.

కొంతమేర ధరల తారుమారు జరిగిందని ప్రభుత్వం సూచించినా, ప్రధాన సమస్య మాత్రం ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకుండా, నిరంతరం ప్రతిస్పందిస్తూ ఉండటమే. నిల్వ సదుపాయాలను మెరుగుపరచడం, తక్కువ అస్థిరమైన వాణిజ్య విధానాన్ని కొనసాగించడం, ప్రాంతాల మధ్య నిల్వలను మరింత సమర్థంగా తరలించడం, ధరల షాక్‌ల నుంచి రైతులను రక్షించడం వంటివి ఇందులో భాగం. పంట కోత సమయంలో అసాధారణ వర్షపాతం, మహారాష్ట్రలో ఖరీఫ్ పంటలో 5-7 శాతం క్షీణత, ఉల్లిని నిల్వ చేయడంలో, భారీ బఫర్ నిల్వలను నిర్వహించడంలో ఎదురయ్యే సవాళ్లతోపాటు, ఈ ఏడాది ఈ లోపాన్ని మరింత స్పష్టం చేసిన ఒత్తిళ్లలో ఇవి కొన్ని మాత్రమే. లాసల్‌గావ్‌లో ఆగస్టులో ఉల్లి ధరలు వారంలోనే దాదాపు 25 శాతం పెరగడం, ఖరీఫ్ దిగుబడులు ఆలస్యం కావడం, వాతావరణ సంబంధిత నష్టం, నిల్వ చేసిన రబీ ఉల్లి నాణ్యత క్షీణించడం వంటివి కొరత సీజన్ ప్రారంభమైన సమయంలోనే సరఫరాను కుదించాయి. దీనికితోడు, తమిళనాడు ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డుకు కిలో చొప్పున కిలో రూ.35కు పంపిణీ చేయడానికి 1,000 టన్నుల ఉల్లిని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న లక్ష్యిత సబ్సిడీ, కేంద్రంపై స్థిరమైన సరఫరాను కొనసాగించాల్సిన ఒత్తిడిని పెంచనుంది. అయితే, అవసరమైన 8,000 టన్నులకుగాను కేవలం 1,000 టన్నులు మాత్రమే సేకరించగలిగారన్న వాస్తవం, ఈ పరిమిత సబ్సిడీ నిజంగా అస్థిర ఉల్లి మార్కెట్‌ను చల్లార్చగలదా? అన్న ప్రశ్నను లేవనెత్తుతోంది. నిల్వ చేయడాన్ని నిరుత్సాహపరుస్తూనే, ప్రైవేటు రిటైల్ ధరలు తగ్గేందుకు వీలు కల్పించేలా ఈ చర్యను ప్రశంసనీయంగా రూపొందించారు.

అయితే, పొడి ధాన్యాల కోసం రూపొందించిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) నెట్‌వర్క్ ద్వారా ఉల్లిని పంపిణీ చేయడంలో ఉన్న ఇబ్బందుల పట్ల రాష్ట్రం అప్రమత్తంగా ఉండాలి. గోధుమ లేదా బియ్యం కంటే ఉల్లి కోతానంతర నష్టాలకు ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నందున, ఈ నష్టాలు 10-15 శాతం దాటితే, సబ్సిడీని కొనసాగించాల్సిన అవసరం ఏర్పడితే, దీని ఆర్థిక హేతుబద్ధత కుప్పకూలిపోయే ప్రమాదం ఉంది. చివరిగా, ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి చర్యలనే అనుసరిస్తే, ఈ ఏడాది సుమారు 30 శాతం అధిక నిల్వ నష్టాలను దృష్టిలో ఉంచుకుంటే, కేంద్ర బఫర్ నిల్వ వేగంగా అడుగంటిపోయే ప్రమాదం ఉంది. దేశం ఏటా 3-3.5 కోట్ల టన్నుల ఉల్లిని ఉత్పత్తి చేస్తున్నా (చైనా తర్వాత ప్రపంచంలో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారు), జాతీయ శీతల గిడ్డంగి సామర్థ్యంలో ఉల్లికి కేటాయించిన వాటా చాలా తక్కువగా ఉండటం, కోతానంతర నష్టాలు జాతీయ స్థాయిలో 25-30 శాతం వరకూ ఉండటం, ఈ సమస్య మూలాన్ని స్పష్టం చేస్తున్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల నుంచి తమిళనాడు వంటి లోటు రాష్ట్రాలకు రవాణా వ్యవస్థ కూడా అంతంతమాత్రంగానే ఉంది. ప్రత్యేక 'ఉల్లి ఎక్స్‌ప్రెస్' రైళ్ల ద్వారా అత్యవసర సరఫరా చేయాల్సిన పరిస్థితి రావడమే దీనికి నిదర్శనం. ఇలాంటి తాత్కాలిక చర్యలు వేగంగా నిల్వలను తరలించగలవేమో కానీ, ఎప్పుడూ సేకరించని లేదా ఇప్పటికే చెడిపోయిన నిల్వలను తిరిగి సృష్టించలేవు.

ధరల స్థిరీకరణ నిధి కింద బఫర్ నిల్వను వాస్తవ సమయ సేకరణతో అనుసంధానించడం, మండీ ధరల నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, ఎగుమతి సుంకం స్లాబులను దేశీయ టోకు ధరల సూచీలతో ముందుగానే అనుసంధానించడం ద్వారా విచక్షణాధికార విధాన నిర్ణయాలను తగ్గించడం, రాష్ట్రాల మధ్య మార్కెట్ అడ్డంకులను తొలగించి మిగులు ఉల్లిని లోటు ప్రాంతాలకు సాఫీగా తరలించడం వంటి దీర్ఘకాలిక సంస్కరణలే, ఏటా పునరావృతమయ్యే ఈ ఉల్లి సంక్షోభానికి శాశ్వత పరిష్కారాన్ని అందించగలవు. ఉల్లికి కూడా ధరల లోటు చెల్లింపు (ప్రైస్ డెఫిషియెన్సీ పేమెంట్) పథకాన్ని వర్తింపజేస్తే, ప్రభుత్వ సేకరణ ఆలస్యమైనప్పటికీ రైతులను ధరల పతనం నుంచి రక్షించవచ్చన్న సూచన కూడా విధాన వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. కేవలం సంక్షోభం తలెత్తినప్పుడు తాత్కాలిక సబ్సిడీలతో, ఎగుమతి ఆంక్షలతో స్పందించడం కంటే, రైతులకు స్థిరమైన ఆదాయ భరోసా, వినియోగదారులకు స్థిరమైన ధరల లభ్యత రెండింటినీ ఏకకాలంలో సాధించే సమగ్ర విధాన చట్రాన్ని రూపొందించుకోవాల్సిన అవసరం ఇప్పుడు గతంలోకంటే ఎక్కువగా ఉంది. ఉల్లి ధరల ఒడిదొడుకులు కేవలం మార్కెట్ సమస్యగా కాకుండా, రాజకీయ సమస్యగా కూడా మారే చరిత్ర భారత్‌కు ఉంది. 1980లో ఇందిరా గాంధీ ఉల్లి ధరలనే ప్రధాన ఎన్నికల అస్త్రంగా వాడుకున్న ఉదాహరణను ఇక్కడ గుర్తుచేసుకోవచ్చు. అందుకే, ఈ సమస్యను కేవలం ఆర్థిక కోణంలోనే కాకుండా, దీర్ఘకాలిక పాలనా సవాలుగా కూడా ప్రభుత్వం పరిగణించాల్సిన అవసరం లేకపోలేదు.

పనికొచ్చే పలుకు

శరీరం చెప్పే మాటను వినండి

శరీరం ఎప్పుడూ అరవదు..
ముందుగా మెల్లగా చెబుతుంది.
అలసటతో పలకరిస్తుంది..
ఆకలితో హెచ్చరిస్తుంది..
పొట్ట చుట్టూ కొవ్వుతో సంకేతం ఇస్తుంది.. నీరసంతో 'నన్ను కాస్త పట్టించుకో' అంటుంది.

ఆ చిన్న మాటను ఈరోజు వింటే.. రేపటి పెద్ద బాధను తప్పించుకోవచ్చు. తినాలనే కోరిక పదేపదే రావడం, కొద్దిపాటి పనికే అలసిపోవడం, ఎప్పుడూ నీరసంగా అనిపించడం, పొట్ట చుట్టూ కొవ్వు పెరగడం.. ఇవన్నీ చిన్న విషయాల్లాగే కనిపించొచ్చు. కానీ వీటిని నిర్లక్ష్యం చేయకుండా మన జీవనశైలిని ఒకసారి పరిశీలించుకోవాలి. రోజువారీ ఆహారం, నిద్ర, శారీరక కదలిక, ఒత్తిడి.. వీటిలో ఏదైనా సరిగా లేకపోవచ్చు.

మనలో చాలామంది 'నాకు ఏ జబ్బూ లేదు.. నేను ఆరోగ్యంగానే ఉన్నాను' అనుకుంటారు. కానీ ఆరోగ్యం అంటే కేవలం జబ్బు లేకపోవడం కాదు. ఉదయం ఉత్సాహంగా లేవడం, రోజంతా చురుగ్గా ఉండటం, మంచి నిద్ర పట్టడం, శరీరం తేలికగా అనిపించడం కూడా ఆరోగ్యానికి సంకేతాలే.

అందుకే మార్పు కోసం పెద్ద నిర్ణయాలే అవసరం లేదు. చిన్న అలవాట్లను మార్చడం చాలు. రోజూ కొంతసేపు నడవడం, ఇంటివంటకు ప్రాధాన్యం ఇవ్వడం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పప్పులు, తగినంత ప్రొటీన్ తీసుకోవడం, అవసరానికి మించి తినడం తగ్గించడం, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం.. ఇవన్నీ కలిసి శరీరాన్ని మళ్లీ సరైన దారిలోకి తీసుకెళ్తాయి.

మార్పు మొదలుపెట్టడానికి 'సరైన సమయం' కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదు. ఈరోజు ఒక అనవసరమైన చిరుతిండిని తగ్గించడం కావచ్చు.. పది నిమిషాలు ఎక్కువ నడవడం కావచ్చు. చిన్న అడుగులే క్రమంగా పెద్ద మార్పుగా మారతాయి. మన ఆరోగ్యం కోసం మనం చేసే ప్రతి మంచి పని భవిష్యత్తులో మనకే తిరిగి వస్తుంది.

ముఖ్యంగా శరీరంలో మార్పులు కనిపించినప్పుడు 'వయసు వల్లే' అని కొట్టిపారేయకూడదు. అలాగే ప్రతి చిన్న లక్షణానికీ భయపడాల్సిన అవసరం లేదు. ఏదైనా సమస్య ఎక్కువకాలం కొనసాగితే వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది.

మన శరీరం రోజూ మనతో మాట్లాడుతూనే ఉంటుంది. మనం వినకపోతే ఆ స్వరం మరింత గట్టిగా మారుతుంది. అందుకే శరీరం పెద్దగా హెచ్చరించే రోజు కోసం వేచి ఉండకండి. అది మెల్లగా చెప్పే చిన్న మాటనే ఈరోజు వినండి. శరీరం ఇచ్చే హెచ్చరికను నిర్లక్ష్యం చేస్తే అది సమస్యగా మారుతుంది.. అదే హెచ్చరికను అర్థం చేసుకుని అలవాటును మార్చుకుంటే.. అది కొత్త జీవితానికి తొలి అడుగవుతుంది.

సో, అహానికి పోకుండా.. నేను బాగానే ఉన్నాను అన్న భ్రమల్లో ఉండకుండా.. రోజుకి ఒక్కసారైన శరీరం చెప్పే మాట వినండి. ఎక్కువ మాట్లాడేవాడికంటే.. ఎక్కువ వినేవాడే తెలివిమంతుడు, తెలుసుకదా!

సబ్బు నుంచి సీరమ్ వరకూ..!

భారతీయ సౌందర్య ఉత్పత్తులు, బ్రాండ్‌లపై ఇటీవల అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల ఆసక్తి గణనీయంగా పెరిగింది. అమెరికాకు చెందిన లగ్జరీ కాస్మెటిక్స్ దిగ్గజం ఎస్టీ లాడర్, ఈ ఏడాది మార్చిలో భారతీయ ఆయుర్వేద బ్యూటీ బ్రాండ్ ఫారెస్ట్ ఎసెన్షియల్స్‌ను పూర్తిగా కొనుగోలు చేసింది. ఆ తర్వాత జూన్‌లో ఫ్రాన్స్‌కు చెందిన లోరియల్ గ్రూప్ కూడా డిజిటల్ పర్సనల్ కేర్ బ్రాండ్ ఇన్నోవిస్ట్‌లో మెజారిటీ వాటాను చేజిక్కించుకుంది. యూనిలివర్ కూడా గత రెండేళ్లలో తన వెంచర్ క్యాపిటల్ విభాగం ద్వారా భారత్‌లోని కనీసం నాలుగు బ్యూటీ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. ఇద్దరు పిల్లల ఒంటరి తల్లి అయిన మీరా కులకర్ణి, హిమాలయాల సమీపంలో ఒక చిన్న గ్యారేజీలో ఫారెస్ట్ ఎసెన్షియల్స్‌ను ప్రారంభించారు. రెండు దశాబ్దాల్లో ఆ సంస్థ ఒక చిన్న స్టార్టప్ నుంచి ప్రపంచవ్యాప్తంగా వ్యాపారం చేసే బిలియన్ డాలర్ల సంస్థగా ఎదిగింది. భారత బ్యూటీ పరిశ్రమ ఎంత వేగంగా విస్తరించిందో ఈ ప్రయాణమే ప్రతిబింబిస్తుంది. 2025లో భారత బ్యూటీ పరిశ్రమ విలువ సుమారు 23 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.2.2 లక్షల కోట్లు)గా నమోదైంది. ఈ దశాబ్దం చివరినాటికి ఈ పరిశ్రమ దాదాపు రెట్టింపై 40 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.3.83 లక్షల కోట్లు) చేరుకుంటుందని అంచనా. ఇది దేశ జీడీపీ వృద్ధి రేటు కంటే, రిటైల్ మార్కెట్ వృద్ధి రేటుకంటే దాదాపు రెట్టింపు వేగంతో విస్తరిస్తోంది.

ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్‌లో ప్రజల కొనుగోలు శక్తి పెరగడమే ఈ మార్కెట్ వృద్ధికి ప్రధాన చోదకశక్తి. 2019లో భారత తలసరి ఆదాయం రూ.1.9 లక్షలు దాటిందని అంచనా. ఈ స్థాయిని దాటిన తర్వాతే ప్రజలు నిత్యావసరాలు కాకుండా, కోరికల ఆధారిత వస్తువులపై చేసే ఖర్చు వేగంగా పెరగడం మొదలైంది. 2030 నాటికి భారత్‌లో సుమారు 15.5 కోట్ల కుటుంబాల వార్షిక ఆదాయం రూ.9 లక్షలకుపైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇది బ్యూటీ మార్కెట్ వృద్ధికి మరింత ఊతమివ్వనుంది. గతంలో భారతీయులు సబ్బు, ఫేస్ పౌడర్ వంటి ప్రాథమిక వస్తువులు మినహా సౌందర్య ఉత్పత్తులపై పెద్దగా ఖర్చు పెట్టగలిగే ఆర్థిక స్తోమత కలిగి ఉండేవారు కాదు. ఇప్పుడు కొనుగోలు శక్తి పెరగడంతోపాటు, ఈ ఉత్పత్తులు మరింత సులభంగా అందుబాటులోకి వస్తుండటం, వాటిపై అవగాహన పెరగడం గమనార్హం. ఇంటర్నెట్ ఈ ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడాన్ని సులభతరం చేయగా, సోషల్ మీడియా, ఇన్‌ఫ్లుయెన్సర్ల సాయంతో బ్రాండ్‌లు నేరుగా వినియోగదారుల వద్దకు చేరుకుంటున్నాయి. 2030 నాటికి సౌందర్య ఉత్పత్తులపై జరిగే మొత్తం ఖర్చులో సుమారు 35 శాతం ఇ-కామర్స్ ద్వారానే జరుగుతుందని అంచనా. ఐదేళ్ల క్రితం ఇది కేవలం 8 శాతమే ఉండేది. కరోనా మహమ్మారి ఈ పరిశ్రమలో గణనీయమైన మార్పు తీసుకొచ్చింది. కోవిడ్ కాలంలో ప్రజలు ఇళ్లకే పరిమితం కావడంతో, తమ సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ పెట్టడం మొదలుపెట్టారు. అదే సమయంలో టైర్-1, టైర్-2, టైర్-3 నగరాల్లో డిజిటల్ సేవలు భారీగా విస్తరించడంతో, ఇంతకుముందు లేని బ్యూటీ, స్కిన్‌కేర్ సమాచారం భారతీయ వినియోగదారులకు ఒక్కసారిగా అందుబాటులోకి వచ్చింది. కొరియా, యూరప్‌లో ట్రెండింగ్‌లో ఉన్న సౌందర్య పోకడలు, చర్మ సంరక్షణకు ఉపయోగపడే పదార్థాల గురించి తెలుసుకునే అవకాశం లభించింది. ఈ సమాచార ప్రవాహమే భారత్‌లో స్కిన్‌కేర్ పరిశ్రమ భారీగా విస్తరించడానికి నాంది పలికింది.

ఈ నేపథ్యంలోనే, కోవిడ్ కాలంలో ప్రారంభమైన కొన్ని బ్యూటీ కంపెనీలు అత్యంత వేగంగా వృద్ధి చెందడం విశేషం. ఒక్క ఏడాదిలోనే కొన్ని బ్రాండ్‌ల మొత్తం అమ్మకాలు వంద శాతం పెరగడం, భవిష్యత్తులోనూ రెండంకెల వృద్ధి కొనసాగుతుందన్న అంచనాలు ఈ రంగంపై పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వెగన్ స్కిన్‌కేర్, కెఫైన్ ఆధారిత పర్సనల్ కేర్‌వంటి ప్రత్యేక విభాగాల్లోని బ్రాండ్‌లు తమ కేటగిరీల్లో టాప్ 10లో నిలవడం, ఈ మార్కెట్ ఇంకా ప్రారంభ దశలోనే ఉందని, భవిష్యత్తులో మరింత విస్తరించే అవకాశం ఉందని సూచిస్తోంది. అందుకే దీపికా పదుకొనె, కత్రినా కైఫ్, శిల్పాశెట్టి వంటి పలువురు బాలీవుడ్ తారలు ఇటీవలి సంవత్సరాల్లో స్కిన్‌కేర్ కంపెనీలను ప్రారంభించడంలో ఆశ్చర్యం లేదు. సెలబ్రిటీల ప్రాతినిధ్యం, ఈ రంగం ఆకర్షణీయతకు, లాభదాయకతకు అద్దం పడుతోంది. బ్యూటీ ఉత్పత్తుల వినియోగదారుల సంఖ్య దేశంలోని అన్ని ప్రాంతాల్లో పెరుగుతుండటం, ఈ డిమాండ్ కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకపోవడం మరో ముఖ్యమైన పరిణామం. ఈ వృద్ధికి ప్రధాన కారణం జెన్-జెడ్ తరమే. మిలీనియల్స్‌తో పోలిస్తే జెన్-జెడ్ చర్మ సంరక్షణ, పర్సనల్ కేర్ ఉత్పత్తులపై దాదాపు రెండింతలు ఖర్చు చేస్తోంది. దేశంలో అతిపెద్ద ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన ఫ్లిప్‌కార్ట్ డేటా ప్రకారం, బ్యూటీ, పర్సనల్ కేర్ ఉత్పత్తులు కొనేవారిలో సుమారు 56 శాతం మంది జెన్-జెడ్‌కు చెందినవారే. వీరిలో 70 శాతం మంది యువత తాము కొనే ఉత్పత్తుల గురించి సోషల్ మీడియా ద్వారానే సమాచారం తెలుసుకుంటున్నారు. అంతేకాక, ఫ్లిప్‌కార్ట్‌లో సౌందర్య ఉత్పత్తుల కోసం జరిగే ప్రతి మూడు సెర్చ్‌లలో రెండు ప్రధాన నగరాల వెలుపలి నుంచే వస్తుండటం, ఈ వృద్ధి ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కూడా విస్తరించిందని స్పష్టం చేస్తోంది. సౌందర్య ఉత్పత్తులపై చేసే మొత్తం ఖర్చులో జెన్-జెడ్, జెన్-ఆల్ఫా వాటా 2024లో 32 శాతం ఉండగా, 2030నాటికి సుమారు 50 శాతానికి పెరుగుతుందని అంచనా. ఇది ఈ పరిశ్రమకు కీలకమైన మార్పుదశగా నిలుస్తోంది. ఒకప్పుడు యువతకు సౌందర్య ఉత్పత్తులు కొనడం కేవలం ఒక కోరికగా ఉండేదైతే, ఇప్పుడు అవి రోజువారీ స్వీయ సంరక్షణలో అంతర్భాగంగా మారాయి.

మార్కెట్ మరింత విస్తరించే కొద్దీ వినియోగదారుల్లో అవగాహన మరింత పెరిగే అవకాశముంది. తర్వాతి దశలో ప్రత్యేక పదార్థాలతో కొత్త ఉత్పత్తులు తయారుచేసే చిన్న బ్రాండ్లు, చర్మవైద్యుల సలహాతో రూపొందించే ఉత్పత్తులు, చర్మానికి పోషణ అందించే ఉత్పత్తులే ఈ రంగం వృద్ధికి ప్రధాన చోదకశక్తులుగా నిలవనున్నాయి. ఇప్పటివరకు కొన్ని బ్యూటీ బ్రాండ్‌లు మాత్రమే పెద్దస్థాయికి ఎదిగినా, ఇదే వేగంతో వృద్ధి కొనసాగితే వచ్చే మూడునుంచి ఐదేళ్లలో కనీసం 10 నుంచి 15 బ్యూటీ కంపెనీలు 200 మిలియన్ డాలర్లు (సుమారు రూ.1,900 కోట్లు) లేదా అంతకంటే ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉందని అంచనా. ఇలాంటిది జరిగితే, చాలా కంపెనీలు స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించే అవకాశముంది. ఈ రంగంలో ఐపీవోలు, విలీనాలు, కొనుగోళ్ల కార్యకలాపాలు కూడా భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

మొత్తంమీద, భారత సౌందర్య పరిశ్రమ కేవలం ఒక వినియోగ ధోరణిగా మాత్రమే మిగలకుండా, ఆర్థిక వృద్ధికి, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ఒక ఆకర్షణీయమైన అవకాశంగా రూపాంతరం చెందుతోంది. పెరుగుతున్న ఆదాయాలు, డిజిటల్ అనుసంధానత, యువతరం మారుతున్న ప్రాధాన్యతలు - ఈ మూడు అంశాలు కలిసి, రాబోయే దశాబ్దంలో భారత్‌ను ప్రపంచ సౌందర్య పరిశ్రమలో ఒక కీలక శక్తిగా నిలబెట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ■



నియంత్రణలో ఉన్న విషయాల వై మాత్రమే దృష్టి పెడితే సగం ఆందోళన మాయమవుతుంది. ఆరోగ్యం గురించి బెంగగా ఉంటే.. మంచి ఆహారం తింటూ వ్యాయామం ప్రారంభించండి. ఆర్థిక సమస్య ఉంటే మరో ఆదాయ మార్గాన్ని వెతుక్కోండి. ఆందోళన అనేది చాలాసార్లు అసలైన సమస్య వల్ల రాదు. చేయాల్సిన పనిని ఆపేసి ఊరికే కూర్చోవడం వల్లే వస్తుంది. ఆలోచిస్తూ కూర్చోవడం కంటే అడుగు ముందుకు వేసి పని ప్రారంభించడమే దానికి ఏకైక పరిష్కారం. ఆందోళనను జయించాలంటే ఆలోచనలకు కాదు.. ఆచరణకు అడుగు వేయాలి.

-మహాదేవ

వింతల్లో వింతలు

పిల్లల కోసం పబ్లిక్ ఎలివేటర్

చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లోని మారుమూల పర్వత గ్రామంలోని విద్యార్థులకు పాఠశాలకు వెళ్లడం ఇక కష్టమైన ప్రయాణం కాదు. నిటారుగా ఉన్న కొండను ఎక్కాల్సిన చిన్నారుల కోసం ఏకంగా 288 మీటర్ల ఎత్తైన ఔట్‌డోర్ ఎలివేటర్ నిర్మించారు. 'ఫుయావో లాడర్'గా పిలిచే ఈ ప్రత్యేక లిఫ్ట్.. కొండపై ఉన్న బోర్డింగ్ స్కూల్‌కు పిల్లలు సులభంగా, సురక్షితంగా చేరేందుకు ఉపయోగపడుతోంది. ప్రతిరోజూ కొండలపై సాగే వారి కష్టాలకు ఇది సాంకేతిక పరిష్కారంగా నిలిచింది.

రోజూ అనేక నిర్ణయాలు తీసుకుంటూ మెదడు మానసికంగా అలసిపోతుంటే ఏం చేయాలి..?

రోజువారీ జీవితంలో ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఎన్నో నిర్ణయాలు తీసుకుంటుంటారు. ఏం తినాలి, ఏం ధరించాలి, ఎప్పుడు ఏ పని చేయాలి, ఎవరికి మెసేజ్ చేయాలి, పనిలో ఏ నిర్ణయం తీసుకోవాలి వంటి చిన్నా పెద్ద ఎంపికలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. అయితే ఇలా వరుసగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల మెదడుపై మానసిక భారం పెరిగి, కొంతసేపటికి అలసటకు దారితీసే అవకాశం ఉంటుంది. దీనినే డెసిషన్ ఫటీగ్ లేదా నిర్ణయాల వల్ల కలిగే మానసిక అలసటగా పిలుస్తారు. ఇది ఏకాగ్రత, ఆలోచనా సామర్థ్యం, తదుపరి నిర్ణయాలు తీసుకునే విధానాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఒకే రోజులో పదుల సంఖ్యలో నిర్ణయాలు తీసుకోవాల్సి రావడం సాధారణమే. వాటిలో కొన్ని చాలా చిన్నవిగా అనిపించినప్పటికీ, ప్రతి ఎంపికను పరిశీలించడం, వివిధ అవకాశాలను బేరీజు వేయడం, నిర్ణయం సరైనదేనా కాదా అని ఆలోచించడం మెదడుకు మానసిక శ్రమను కలిగిస్తుంది. ముఖ్యంగా అనిశ్చితి ఎక్కువగా ఉన్నప్పుడు, అనేక ఎంపికల మధ్య నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు లేదా తీసుకున్న నిర్ణయానికి బాధ్యత వహించాల్సి వచ్చినప్పుడు ఈ మానసిక భారం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. మానసిక అలసటపై జరిగిన పరిశోధనలు ఇది ఏకాగ్రత తగ్గడం, ఆలోచించే వేగం మందగించడం, తప్పులు పెరగడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఇబ్బందులు వంటి సమస్యలతో సంబంధం కలిగి ఉంటుందని సూచిస్తున్నాయి.

ఏకాగ్రత తగ్గే అవకాశం..

మానసిక అలసటకు లోనైనప్పుడు దాని ప్రభావం ఏకాగ్రతపై స్పష్టంగా కనిపిస్తుంది. ముఖ్యమైన పని పూర్తి చేయడానికి కూర్చున్నప్పటికీ పదేపదే ఫోన్ చూడటం, ఒకే పేరాగ్రాఫ్‌ను మళ్లీ మళ్లీ చదవడం లేదా పని ఎక్కడి నుంచి ప్రారంభించాలో అర్థం కాకపోవడం వంటివి జరుగుతాయి. దీంతో తమ ఏకాగ్రత సామర్థ్యం తగ్గిపోయిందని చాలా మంది భావిస్తారు. అయితే ప్రతిసారీ సమస్య నేరుగా ఏకాగ్రత లోపం కావాల్సిన అవసరం లేదు. రోజంతా వరుసగా ఎన్నో ఎంపికలు చేయడం వల్ల మెదడు ముందుగానే అలసిపోయి ఉంటుంది. దాంతో తర్వాత చేయాల్సిన పనులపై దృష్టి పెట్టడం మరింత కష్టంగా మారుతుంది. అయితే ఎన్ని నిర్ణయాలు తీసుకున్నామన్నది మాత్రమే ముఖ్యం కాదు. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందన్నది కూడా మానసిక అలసటపై ప్రభావం చూపుతుంది. అనేక ఎంపికల మధ్య ఒకదాన్ని ఎంచుకోవడం, పరిస్థితి స్పష్టంగా లేకపోవడం లేదా నిర్ణయం వల్ల గణనీయమైన పరిణామాలు ఏర్పడే అవకాశం ఉన్నప్పుడు ఎక్కువ మానసిక శ్రమ అవసరం అవుతుంది. ముఖ్యంగా ఉద్యోగానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకున్న తర్వాత కూడా వాటి గురించి ఆలోచిస్తూ ఉండటం వల్ల మానసిక అలసట మరుసటి రోజుకూ కొనసాగే అవకాశం ఉంటుంది.

అలసిపోయినప్పుడు నిర్ణయాలు వద్దు..

మానసికంగా అలసిపోయినప్పుడు నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఆసక్తి తగ్గుతుంది. కొందరు నిర్ణయాలను వాయిదా వేయడం, అందుబాటులో ఉన్న సులభమైన ఎంపికను ఎంచుకోవడం లేదా ఒకే విషయంపై స్థిరమైన నిర్ణయం తీసుకోలేకపోవడం వంటివి జరుగుతాయి. ఇలా ఒక సమస్య మరో సమస్యకు దారితీసే పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కువ నిర్ణయాలు మానసిక అలసటను పెంచుతాయి. ఆ అలసట వల్ల తర్వాతి నిర్ణయాలు తీసుకోవడం మరింత కష్టమవుతుంది. దీంతో ఒత్తిడి, అయోమయం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఏకాగ్రత లోపించిన ప్రతిసారీ దానికి నిర్ణయాల అలసటే కారణమని భావించకూడదు. తగినంత నిద్ర లేకపోవడం, ఆందోళన, డిప్రెషన్, శ్రద్ధకు సంబంధించిన సమస్యలు, పోషకాహార లోపాలు, థైరాయిడ్ సమస్యలు, ఇతర ఆరోగ్య పరిస్థితులు కూడా ఏకాగ్రతను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఏకాగ్రత సమస్యలు నిరంతరం కొనసాగితే లేదా పని, చదువు, సంబంధాలు, ఇంటి బాధ్యతలపై ప్రభావం చూపిస్తే వైద్య లేదా మానసిక ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది. డెసిషన్ ఫటీగ్‌ను తగ్గించుకోవడానికి రోజులోని ప్రతి నిర్ణయాన్ని తొలగించాల్సిన అవసరం లేదు. అవసరం లేని చిన్న చిన్న ఎంపికలను తగ్గించడం ద్వారా మానసిక శక్తిని ఆదా చేసుకోవచ్చు. ప్రతిరోజూ చేసే పనులకు కొన్ని సులభమైన రొటీన్‌లను ఏర్పాటు చేసుకోవడం ఇందుకు ఉపయోగపడుతుంది. ఉదాహరణకు భోజనం, పని లేదా ఇతర రోజువారీ కార్యకలాపాలను ముందుగానే ప్లాన్ చేసుకోవడం వల్ల ప్రతిసారీ కొత్తగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం తగ్గుతుంది.

మెదడు తాజాగా ఉన్న సమయంలోనే..

ముఖ్యమైన లేదా క్లిష్టమైన నిర్ణయాలను మెదడు తాజాగా ఉన్న సమయంలో తీసుకోవడం మంచిది. రోజంతా అనేక పనులు, నిర్ణయాలతో అలసిపోయిన తర్వాత కీలకమైన విషయాలపై ఆలోచించడం కంటే, మానసికంగా ప్రశాంతంగా ఉన్న సమయంలో వాటిని పూర్తి చేయడం మంచిది. అలాగే అవసరం లేని ఎంపికలను తగ్గించడం, పనులను ముందుగానే క్రమబద్ధీకరించుకోవడం ద్వారా మానసిక గందరగోళాన్ని తగ్గించుకునే వీలు ఉంటుంది. స్క్రీన్‌లు, పని, నిరంతర నోటిఫికేషన్లకు కొంతసేపు దూరంగా ఉండటం కూడా మెదడుకు విశ్రాంతి కల్పిస్తుంది. అలాగే ఇంట్లో లేదా పని ప్రదేశంలో ప్రతి చిన్న నిర్ణయాన్ని మనమే తీసుకోవాల్సిన అవసరం లేకుండా బాధ్యతలను ఇతరులతో పంచుకోవడం ద్వారా మానసిక భారాన్ని తగ్గించుకోవచ్చు. కష్టమైన రోజు తర్వాత అప్పుడప్పుడు మానసికంగా అలసిపోవడం సాధారణమే. అయితే ఏకాగ్రత సమస్యలు నిరంతరం కొనసాగడం, రోజువారీ పనులకు ఆటంకం కలిగించడం లేదా నిద్ర, మూడ్, ఆకలి, ప్రవర్తనలో గణనీయమైన మార్పులతో కలిసి కనిపించడం వంటివి ఉంటే దాన్ని కేవలం డెసిషన్ ఫటీగ్‌గా భావించి నిర్లక్ష్యం చేయకూడదు. తగిన విశ్రాంతి, రోజువారీ అలవాట్లలో మార్పులు చేసినప్పటికీ సమస్య కొనసాగితే, దాని వెనుక ఉన్న కారణాన్ని గుర్తించడానికి నిపుణుల సలహా తీసుకోవడం అవసరం. నిరంతరం నిర్ణయాలు తీసుకోవడం నిజంగానే మానసికంగా శ్రమతో కూడుకున్న ప్రక్రియ. దీనివల్ల కలిగే అలసట కొన్నిసార్లు సాధారణ ఏకాగ్రత సమస్యలను మరింత తీవ్రంగా అనిపించేలా చేస్తుంది. అందుకే ప్రతిసారీ మరింతగా ప్రయత్నించి ఏకాగ్రత పెంచుకోవాలని భావించడం కంటే, అవసరం లేని నిర్ణయాలను తగ్గించడం, రోజువారీ జీవితంలో సులభమైన రొటీన్‌లను ఏర్పాటు చేసుకోవడం, పనుల మధ్య మెదడుకు తగినంత విశ్రాంతి ఇవ్వడం కూడా ముఖ్యమేనని నిపుణులు చెబుతున్నారు.

రోజువారీ ప్రొటీన్ అవసరాలను సోయాబీన్స్ తీరుస్తాయా..

రోజుకు ఎంత తీసుకోవాలి..?

భారతీయుల ఆహారంలో ప్రొటీన్ లోపం ఒక ముఖ్యమైన పోషకాహార సమస్యగా మారుతోంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆహార సర్వేలు, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5), భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్)కు సంబంధించిన నివేదికల ప్రకారం.. 70 శాతానికి పైగా భారతీయుల్లో ప్రొటీన్ లోపం ఉన్నట్లు, దాదాపు 90 శాతం మందికి తమ రోజువారీ ప్రొటీన్ అవసరం ఎంత అన్నదానిపై స్పష్టమైన అవగాహన లేదని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే మొక్కల ఆధారిత ప్రొటీన్ వనరులపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. రోజువారీ ఆహారంలో అన్నం, గోధుమ పిండి వంటి ధాన్యాలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. వీటిలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండడంతోపాటు, శరీరానికి అందే ప్రొటీన్ పరిమాణం కూడా పరిమితంగానే ఉంటుంది. అందుకే ప్రొటీన్ అవసరాలను తీర్చుకునేందుకు సోయాబీన్స్ వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రొటీన్లకు మంచి వనరు..

మొక్కల ఆధారిత ఆహారాల్లో సోయాబీన్స్ ను ప్రొటీన్‌లకు మంచి వనరుగా పరిగణిస్తారు. అయితే పచ్చి సోయాబీన్స్‌ను ఉడికించిన తర్వాత అందులో ఎంత ప్రొటీన్ ఉంటుంది ? ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్ రోజువారీ ప్రొటీన్ అవసరాల్లో ఎంతవరకు తీర్చగలదు ? అనే విషయాలు చాలామందికి తెలియవు. ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) రూపొందించిన ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ (ఐఎఫ్‌సీటీ) 2017 ప్రకారం.. 100 గ్రాముల పచ్చి సోయాబీన్స్‌లో సుమారు 35.58 గ్రాముల నుంచి 37.80 గ్రాముల వరకు ప్రొటీన్ ఉంటుంది. అయితే సోయాబీన్స్‌ను ఉడికించినప్పుడు అవి గణనీయమైన మొత్తంలో నీటిని పీల్చుకుంటాయి. దీంతో వాటి బరువు, పరిమాణం పెరుగుతుంది. సుమారు 170 గ్రాముల బరువుండే ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్‌లో దాదాపు 28 నుంచి 31 గ్రాముల ప్రొటీన్ లభిస్తుంది.

ఎంత ప్రొటీన్ అవసరం..?

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ 2020 పోషకాహార మార్గదర్శకాల ప్రకారం.. శరీర బరువులో ప్రతి కిలోగ్రాముకు 0.66 గ్రాముల ప్రొటీన్ అవసరం ఉంటుందని అంచనా. సిఫార్సు చేసిన రోజువారీ పరిమాణం (ఆర్‌డీఏ) ప్రతి కిలోగ్రాము శరీర బరువుకు 0.83 గ్రాములుగా ఉంది. ఉదాహరణకు 60 కిలోల బరువున్న ఒక వ్యక్తికి రోజుకు సుమారు 50 గ్రాముల ప్రొటీన్ అవసరం అవుతుంది. ఈ లెక్కన ఒక కప్పు ఉడికించిన సోయాబీన్స్ తీసుకోవడం ద్వారా రోజువారీ ప్రొటీన్ అవసరాల్లో 55 నుంచి 60 శాతం వరకు పొందవచ్చు. సోయాబీన్స్‌లో శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. అందువల్ల దీనిని పూర్తి స్థాయి ప్రొటీన్ వనరుగా పరిగణిస్తారు. ఇతర పప్పుధాన్యాలు, ధాన్యాల్లో కొన్ని ముఖ్యమైన అమైనో ఆమ్లాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, సోయాలో అవన్నీ ఉండటం దీని ప్రత్యేకత. సోయాబీన్స్‌ను వండుకుని తినడం వల్ల వాటిలో సహజంగా ఉండే కొన్ని యాంటీ న్యూట్రిషనల్ ఫ్యాక్టర్ల ప్రభావం కూడా తగ్గుతుంది. పచ్చి సోయాబీన్స్‌లో ట్రిప్సిన్ ఇన్హిబిటర్లు, లెక్టిన్లు, ఫైటేట్లు వంటి పదార్థాలు ఉంటాయి. ఇవి జీర్ణక్రియలో కొన్ని ఎంజైమ్‌ల పనితీరును ప్రభావితం చేయడంతోపాటు, కొన్ని ఖనిజాల శోషణను అడ్డుకుంటాయి. అయితే సోయాబీన్స్‌ను నానబెట్టి ఉడికించడం లేదా ప్రెజర్ కుకింగ్ చేయడం వంటి వేడి ప్రక్రియల ద్వారా వీటి ప్రభావం గణనీయంగా తగ్గుతుంది. దీంతో ప్రొటీన్ జీర్ణం కావడం, శరీరానికి అమైనో ఆమ్లాలు అందడం మెరుగుపడుతుంది.

కండరాల ఆరోగ్యానికి..

రోజువారీ ప్రొటీన్ అవసరాలను సోయాబీన్స్ వంటి మొక్కల ఆధారిత ఆహారాల ద్వారా తీర్చుకోవడం కండరాల ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతుంది. తగినంత ప్రొటీన్లను తీసుకోవడం కండరాల నిర్మాణం, మరమ్మత్తు, శరీర జీవక్రియలకు తోడ్పడుతుంది. సరైన పరిమాణంలో తీసుకున్నప్పుడు సోయా ప్రొటీన్ కూడా కండరాల ప్రొటీన్ సంశ్లేషణకు సహాయపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే రోజంతా అవసరమైన ప్రొటీన్ మొత్తాన్ని సోయాబీన్స్ నుంచే పొందాలని నిపుణులు సూచించడం లేదు. సోయాబీన్స్‌లో రాఫినోస్, స్టాకియోస్ వంటి సంక్లిష్ట ఒలిగోశాకరైడ్లు ఉంటాయి. ఇవి పేగుల్లోని బ్యాక్టీరియా ద్వారా పులియడం వల్ల కొంతమందిలో గ్యాస్, కడుపు ఉబ్బరం, జీర్ణ సంబంధిత అసౌకర్యం కలుగుతాయి. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారు ఎక్కువ మొత్తంలో తీసుకుంటే ఈ సమస్యలు మరింతగా కనిపించే అవకాశం ఉంటుంది. అందువల్ల రోజువారీ ఆహారంలో సోయాబీన్స్‌ను సరైన మోతాదులో చేర్చుకోవడం మంచిది.

ఇతర ఆహారాలు కూడా ముఖ్యమే..

ఒకే ఆహార పదార్థంపై ఆధారపడకుండా సోయాబీన్స్‌తోపాటు అన్నం, మిల్లెట్స్ వంటి ధాన్యాలు, పెరుగు, పనీర్ వంటి పాల ఉత్పత్తులను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. ఇలా వివిధ రకాల ఆహార పదార్థాలను కలిపి తీసుకోవడం ద్వారా ప్రొటీన్‌తోపాటు విటమిన్ బి12, కాల్షియం, ఐరన్ వంటి ఇతర ముఖ్యమైన పోషకాలను కూడా పొందే అవకాశం ఉంటుంది. సోయాబీన్స్ అధిక ప్రొటీన్, అవసరమైన అమైనో ఆమ్లాలతో కూడిన పోషకమైన ఆహారం. అయితే ఎంత పోషకమైన ఆహారమైనా పరిమితికి మించి తీసుకోవడం మంచిది కాదు. సమతుల్య ఆహారంలో భాగంగా సరైన మోతాదులో సోయాబీన్స్‌ను చేర్చుకోవడం ద్వారా రోజువారీ ప్రొటీన్ అవసరాలను తీర్చుకోవడంలో ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

కిచెన్‌లో వాడే టవల్స్‌ను ఇలా శుభ్రం చేయండి..

రోగాలు రాకుండా అడ్డుకోవచ్చు..

కిచెన్ లో వాడే టవల్స్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం చాలా ముఖ్యం. డిటర్జెంట్ పౌడర్, బేకింగ్ సోడా, డిష్ సోప్, నిమ్మకాయ, వెనిగర్, ఉప్పు వంటి వాటితో జిడ్డు, మరకలు, దుర్వాసనను సులభంగా తొలగించవచ్చు. ఇంట్లో అత్యంత శుభ్రంగా ఉండాల్సిన ప్రదేశాల్లో వంటగది ఒకటి. అయితే వంటగదిలో మనం తరచూ ఉపయోగించే కిచెన్ టవల్స్‌పై మాత్రం పెద్దగా దృష్టి పెట్టం. చేతులు తుడుచుకోవడం, పాత్రలు ఆరబెట్టడం, కౌంటర్‌పై పడిన నీరు లేదా ఆహార పదార్థాలను తుడవడం వంటి పనులకు వీటిని ఉపయోగిస్తుంటాం. దీంతో టవల్స్ త్వరగా జిడ్డుగా మారడంతో పాటు మరకలు పడతాయి. తేమ కారణంగా దుర్వాసన కూడా వస్తుంది. అందుకే ఇతర కిచెన్ వస్తువుల మాదిరిగానే కిచెన్ టవల్స్‌ను కూడా క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. ఇంట్లోనే సులభంగా ప్రయత్నించగలిగే కొన్ని క్లీనింగ్ పద్ధతుల గురించి నిపుణులు వివరిస్తున్నారు.

డిటర్జెంట్ పౌడర్..

కిచెన్ టవల్స్‌ను శుభ్రం చేయడానికి సులభమైన మార్గాల్లో డిటర్జెంట్ పౌడర్ ఒకటి. ఒక బేసిన్‌లో వేడి నీటిని తీసుకుని కొద్దిగా డిటర్జెంట్ పౌడర్ కలపాలి. మురికిగా ఉన్న టవల్స్‌ను అందులో సుమారు 30 నిమిషాల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత టవల్‌ను చేతులతో సున్నితంగా రుద్ది, గోరువెచ్చని నీటితో బాగా కడగాలి. వీలైతే నేరుగా సూర్యరశ్మి తగిలేలా ఆరబెట్టాలి. ఇక జిడ్డు, మరకలు, దుర్వాసనతో ఉన్న కిచెన్ టవల్స్‌ను శుభ్రం చేయడంలో బేకింగ్ సోడా కూడా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా మసాలా మరకలను తొలగించడానికి కొద్దిగా బేకింగ్ సోడాలో వేడి నీటిని కలిపి మందమైన పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను మరక ఉన్న ప్రదేశంలో రాసి సుమారు 20 నిమిషాల పాటు ఉంచాలి. ఆ తర్వాత సబ్బు, నీటితో టవల్‌ను బాగా కడగాలి. టవల్స్‌కు తాజా వాసన రావాలంటే కొన్ని నిమ్మ తొక్కలను నీటిలో మరిగించి, ఆ నీటిలో టవల్స్‌ను కొంతసేపు నానబెట్టి తర్వాత కడగాలి.

డిష్ సోప్..

అలాగే డిష్ సోప్ నూనె, జిడ్డును తొలగించడానికి ప్రత్యేకంగా పనిచేస్తుంది. కాబట్టి జిడ్డుగా మారిన కిచెన్ టవల్స్‌ను శుభ్రం చేయడంలో ఇది ఉపయోగపడుతుంది. మరకలు లేదా జిడ్డు ఉన్న ప్రాంతాల్లో కొద్దిగా లిక్విడ్ డిష్ సోప్‌ను నేరుగా రాసి కొన్ని నిమిషాలు ఉంచాలి. తర్వాత టవల్స్‌ను గోరువెచ్చని నీటిలో సుమారు 20 నిమిషాలు నానబెట్టాలి. అనంతరం బాగా ఉతికి, సోప్ అవశేషాలు లేకుండా శుభ్రంగా కడగాలి. అలాగే నిమ్మకాయ, వెనిగర్ రెండూ ఇంట్లో సహజంగా ఉపయోగించే క్లీనింగ్ పదార్థాలు. వెనిగర్ దుస్తులపై పేరుకున్న మురికి, దుర్వాసనను తొలగించడంలో సహాయపడుతుంది. నిమ్మరసం మొండి మరకలను తొలగించడానికి ఉపయోగపడుతుంది. గోరువెచ్చని నీటిలో డిటర్జెంట్ పౌడర్, నిమ్మరసం, కొద్దిగా వెనిగర్ కలపాలి. అందులో కిచెన్ టవల్స్‌ను సుమారు 20 నిమిషాలు నానబెట్టాలి. ఆ తర్వాత శుభ్రమైన నీటితో బాగా కడిగి ఆరబెట్టాలి. అలాగే కిచెన్ టవల్స్‌లోని జిడ్డు, దుర్వాసనను తగ్గించడానికి ఉప్పును కూడా ఉపయోగించవచ్చు. ఒక పాత్ర లేదా బేసిన్‌లో వేడి నీటిని తీసుకుని అందులో రెండు టేబుల్‌స్పూన్ల ఉప్పు కలపాలి. టవల్స్‌ను సుమారు 30 నిమిషాలు అందులో నానబెట్టాలి. ఆ తర్వాత కొద్దిగా లిక్విడ్ సోప్ వేసి టవల్స్‌ను సున్నితంగా రుద్దాలి. చివరగా శుభ్రమైన నీటితో బాగా కడగాలి.

ఎండలో ఆరబెట్టాలి..

వీటితోపాటు కిచెన్ టవల్స్‌ను క్రమం తప్పకుండా ఉతకాలి. కిచెన్ టవల్స్‌ను ప్రతి రెండు లేదా మూడు రోజులకు ఒకసారి ఉతకడం మంచిది. ఇలా చేయడం వల్ల జిడ్డు, మరకలు, బ్యాక్టీరియా పేరుకుపోకుండా చూసుకోవచ్చు. ఎండలో ఆరబెట్టాలి. టవల్స్‌ను ఉతికిన తర్వాత వీలైనప్పుడల్లా నేరుగా సూర్యరశ్మి తగిలేలా ఆరబెట్టాలి. సూర్యరశ్మి తేమను తగ్గించడంతోపాటు టవల్స్ తాజాగా ఉండేందుకు సహాయపడుతుంది. కిచెన్‌లో ప్రతిరోజూ ఉపయోగించే టవల్స్ చిన్నవిగా కనిపించినా, వాటిపై శ్రద్ధ పెట్టడం పరిశుభ్రతకు చాలా ముఖ్యం. క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, పూర్తిగా ఆరబెట్టడం ద్వారా టవల్స్‌ను శుభ్రంగా, తాజాగా ఉంచుకునే అవకాశం ఉంటుంది.

రోహిత్ శర్మ రిటైర్మెంట్ రూమర్స్‌కు బీసీసీఐ చెక్..
పుకార్లను నమ్మొద్దన్న దేవజిత్ సైకియా

హైదరాబాద్ పెన్ పవర్: 2027 వన్డే ప్రపంచకప్‌లో మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆడతాడా లేదా అనే ఊహాగానాలకు బీసీసీఐ తెరదించింది. ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈరోజు (సెప్టెంబర్ 3న) జరిగిన సమీక్షా సమావేశం అనంతరం రోహిత్ స్థానానికి ఎలాంటి ముప్పు లేదని భారత క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. రోహిత్ భవిష్యత్తుపై ప్రస్తుతం యథాతథ స్థితి కొనసాగుతుందని, అతడు ప్రసుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడని బీసీసీఐ కార్యదర్శి దేవ్‌జీత్ సైకియా స్పష్టం చేశారు.

హై-వోల్టేజ్ మీటింగ్.. చీఫ్ సెలెక్టర్ అగార్కర్ గైర్హాజరీ:

ఈ కీలక భేటీకి వన్డే, టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ నేరుగా హాజరయ్యారు. అయితే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ సమావేశానికి గైర్హాజరు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ముంబైకి దూరంగా ఇంటర్నెట్ సదుపాయం లేని ప్రాంతంలో ఉండటం వల్లే అగార్కర్ హాజరుకాలేదని సమాచారం ఉన్నప్పటికీ, ఆయన గైర్హాజరీపై క్రికెట్ వర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లక్ష్మణ్ కొత్త రోల్, సెలెక్షన్ కమిటీ మార్పులపై క్లారిటీ:

మరోవైపు వీవీఎస్ లక్ష్మణ్‌కు డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ లాంటి కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నారంటూ వస్తున్న ప్రచారాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా

పూర్తిగా తోసిపుచ్చారు. అలాగే అజిత్ అగార్కర్ నాయకత్వంలోని సెలెక్షన్ కమిటీలో ఎలాంటి తక్షణ మార్పులు చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ సమావేశానికి అగార్కర్ రాకపోయినప్పటికీ సెలెక్షన్ ప్యానెల్ తీరుపై ఎలాంటి అసంతృప్తి లేదని, ప్రస్తుతానికి అదే కమిటీని ముందుకు కొనసాగిస్తున్నట్లు బోర్డు తేల్చి చెప్పింది.

రోహిత్ ఫామ్‌పై ప్రశంసలు.. వరల్డ్ కప్ రేసులో హిట్‌మ్యాన్:

ఇటీవల ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో లార్డ్స్ మైదానంలో 138 పరుగులతో విరుచుకుపడిన స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ బ్యాటింగ్ శైలిని దేవజిత్ సైకియా ప్రత్యేకంగా కొనియాడారు. రోహిత్ ఎంత అద్భుతంగా ఆడుతున్నాడో మీరు కూడా చూస్తున్నారు కదా అని వ్యాఖ్యానిస్తూ, అతని స్థానం ఇప్పటికిప్పుడు ఎలాంటి ప్రమాదంలో లేదూ, ప్రస్తుతం జరుగుతున్న పుకార్లకు అడ్డుకట్ట వేశారు. దీంతో 2027 వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ శర్మ భాగస్వామ్యంపై బీసీసీఐ సానుకూలంగా ఉందనే విషయం స్పష్టమైంది.

గాయమంటూ దొంగ నాటకాలు.. పాకిస్థాన్ ఓపెనర్‌పై రెండేళ్ల బ్యాన్..



హైదరాబాద్ పెన్ పవర్: పాకిస్థాన్ ఓపెనర్ ఇమామ్-వుల్-హక్ అంతర్జాతీయ కెరీర్ తీవ్ర ప్రమాదంలో పడింది. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన రెండో టెస్ట్ మ్యాచ్‌లో గాయం పేరుతో దొంగ నాటకలు ఆడారనే తీవ్ర ఆరోపణలతో అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఏకంగా 2 ఏళ్ల పాటు బ్యాన్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన ఇమామ్, రెండో టెస్టులో పిక్క కండరాల గాయం నెపంతో రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్‌కు దిగలేదు. కానీ అతను నిజమైన గాయంతో బాధపడటం లేదని, కేవలం బ్యాటింగ్ నుంచి తప్పించుకునేందుకే డ్రామా ఆడాడని పాక్ క్రికెట్ బోర్డు (గ్రాజదీ) అనుమానిస్తోంది.

పీసీబీ హై-లెవెల్ ఇంక్వైరీ:

ఇమామ్ ఇలా గాయం పేరుతో డ్రామాలు ఆడటం ఇది మొదటిసారి కాదని తెలుస్తోంది. మార్చి 2025లో న్యూజిలాండ్ పర్యటనలోనూ ఇండోర్ నెట్ ప్రాక్టీస్ సమయంలో కుడి కాలి వేలికి గాయమైందంటూ మెడికల్ టీమ్‌ను తప్పుదోవ పట్టించి జట్టు నుంచి తప్పుకున్నట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. తాజాగా లార్డ్స్ టెస్టులో కూడా అదే పునరావృతం కావడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన పీసీబీ, ఇమామ్‌పై విచారణకు ఒక హై-లెవెల్ కమిటీని నియమించింది. విచారణలో అతడు దోషిగా తేలితే 1 నుంచి 2 ఏళ్ల పాటు క్రికెట్ ఆడకుండా కఠినంగా నిషేధించనున్నారు.

మహమ్మద్ రిజ్వాన్ కెరీర్ ఎండ్ కార్డ్:

మరోవైపు స్టార్ వికెట్ కీపర్, పాక్ మాజీ వైట్ బాల్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్ పరిస్థితి కూడా అత్యంత దారుణంగా తయారైంది. మూడో టెస్టుకు ముందే పీసీబీ జట్టు నుంచి తొలగించి పాకిస్థాన్‌కు పంపించిన 7 గురు ఆటగాళ్లలో రిజ్వాన్ కూడా ఉన్నాడు. జట్టులో క్రమశిక్షణారాహిత్యంతో ప్రవర్తించడం, మైదానంలో బాధ్యతారాహిత్యంగా చెత్త షాట్లు కొడుతూ వికెట్ పారేసుకోవడంపై పాక్ బోర్డు సీరియస్ అయింది. దీంతో రిజ్వాన్ అంతర్జాతీయ కెరీర్‌కు దాదాపు ఎండ్ కార్డ్ పడినట్లేనని, సమీప భవిష్యత్తులో అతను మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చే అవకాశాలు లేవని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

పాక్ క్రికెట్‌లో ఊచకోత.. షాక్‌లో ఆటగాళ్లు:

ఇంగ్లాండ్ పర్యటనలో ఎదురైన పరాజయాల తర్వాత పాకిస్థాన్ క్రికెట్ బోర్డు జట్టులో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఏకంగా ఏడుగురు ప్లేయర్లను అర్ధాంతరంగా టూర్ నుంచి తప్పించి స్వదేశానికి పంపడంతో లంక, ఇంగ్లాండ్ సిరీస్‌లు ఆడుతున్న ఆటగాళ్లు షాక్‌లో ఉండిపోయారు. ఒకవైపు డ్రెస్సింగ్ రూమ్ వివాదాలు, మరోవైపు ఇమామ్, రిజ్వాన్ వంటి సీనియర్లపై కఠిన చర్యలతో పాక్ క్రికెట్‌లో ప్రస్తుతం తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకొంది.

నేను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటం లేదు.. చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులో తన రోల్‌పై ఎంఎస్ ధోనీ క్లారిటీ!

హైదరాబాద్ పెన్ పవర్: చెన్నై సూపర్‌కింగ్స్ దిగ్గజం, మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి తన రోల్‌పై కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు సీఎస్కే మాజీ ఆటగాడు ఎస్. బద్రీనాథ్ వెల్లడించాడు. రాబోయే సీజన్‌లో ధోనీపై వర్క్‌లోడ్ తగ్గించేందుకు అతనిని ఇంపాక్ట్ ప్లేయర్ గా వాడుకోవాలని ఫ్రాంచైజీ భావిస్తున్నప్పటికీ, తాను మాత్రం పూర్తిస్థాయి వికెట్ కీపర్‌గానే బరిలోకి దిగుతానని ధోనీ తేల్చిచెప్పాడట. తాను ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడనని, 20 ఓవర్ల పాటు మైదానంలో ఉంటూ కీపింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తానని ధోనీ నాతో వ్యక్తిగతంగా చెప్పాడని బద్రీనాథ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పష్టం చేశాడు.

వ్యూహాత్మకంగా మేలైనా.. ధోనీ పట్టుదల అదే:

వయసు రీత్యా శరీరంలో ఫిట్‌నెస్ సమస్యలు ఎదురవుతున్నందున ధోనీని ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఉపయోగిస్తే సీఎస్కేకు వ్యూహాత్మకంగా ఎంతో మేలు జరుగుతుందని బద్రీనాథ్ అభిప్రాయపడ్డాడు. ధోనీ శరీరం సుదీర్ఘ సమయం తీవ్రమైన ఒత్తిడిని తట్టుకోలేకపోతోందని, అతను కేవలం 16వ ఓవర్ తర్వాతే బ్యాటింగ్‌కు వస్తున్నందున కీపింగ్‌కు బదులు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడటమే ఉత్తమమని కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా భావించినట్లు గుర్తు చేశాడు. అయినప్పటికీ, మైదానంలో ఫుల్ టైమ్ ప్లేయర్‌గా ఉండటానికే ధోనీ ప్రాధాన్యత ఇస్తున్నాడని వివరించాడు.

శివమ్ దూబే బౌలింగ్ వివాదం.. మేనేజ్‌మెంట్‌దే తప్పు:

మరోవైపు, సీఎస్కే టీమ్‌లో శివమ్ దూబే బౌలింగ్ చేయకపోవడంపై వస్తున్న కథనాలను బద్రీనాథ్ ఖండించాడు. టీమిండియా తరఫున రెగ్యులర్‌గా బౌలింగ్ చేసే దూబేను సీఎస్కే తరఫున ఆడించేటప్పుడు ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన అడ్డువస్తోందనడం సరికాదన్నాడు. దూబే చేత బౌలింగ్ వేయించకపోవడం అనేది పూర్తిగా సీఎస్కే మేనేజ్‌మెంట్ వ్యూహాత్మక లోపమే తప్ప ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తప్పు కాదన్నాడు. అతనిని కేవలం బ్యాటర్‌గానే ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఎందుకు ఉపయోగిస్తున్నారు? అని బద్రీనాథ్ ప్రశ్నించాడు.

అకీల్ హొసేన్ ప్లేయింగ్ ఎలెవన్ లో తీసుకోండి:

వెస్టిండీస్ స్టార్ స్పిన్నర్ అకీల్ హొసేన్‌ను ప్లేయింగ్ ఎలెవెంలో నేరుగా ఎంపిక చేయకుండా ఇంపాక్ట్ ప్లేయర్‌గా రిజర్వ్‌లో ఉంచడంపై కూడా బద్రీనాథ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. అకీల్ హొసేన్ కచ్చితంగా ప్రధాన జట్టులోనే ఉండాలని, కానీ సీఎస్కే మొదట సరిగ్గా బ్యాటింగ్ చేయకపోగానే అదనపు బ్యాటర్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా తెచ్చి హొసేన్‌ను బెంచ్‌కే పరిమితం చేస్తోందని మండిపడ్డాడు. ఇది తెలివితక్కువ నిర్ణయం.. మీ సొంత నిర్ణయాల లోపానికి ఐపీఎల్ నిబంధనలను నిందించడం సరికాదంటూ చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు.

మహేష్ మైండ్ లో రన్ అవుతోన్న ఇద్దరే ఇద్దరు!

సూపర్‌స్టార్ మహేష్ -దర్శకధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో అడ్వెంచర్ డ్రామా -వారణాసి- జాతీయ స్థాయిలో అంచనాలు అంతకంతకంతకు పెంచేస్తోంది. సినిమా కోసం మహేష్ ప్రత్యేకమైన ఫిజికల్ మేకోవర్ పొందుతూ ప్రపంచస్థాయి వర్క్‌షాప్‌లలో పాల్గొంటున్నారు. అయితే ఈ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ తర్వాత మహేష్ తదుపరి చిత్రం ఏ దర్శకుడితో ఉండబోతోంది? అనే అంశం ఇప్పటికే ఫిలిం సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. రాజమౌళి సినిమా తర్వాత మహేష్ ఎంచుకునే ప్రాజెక్ట్ అదే స్థాయిలో ఉండాలనే ఉద్దేశంతో ఆయన మైండ్‌లో ఇద్దరే ఇద్దరు పవర్‌ఫుల్ దర్శకులు రన్ అవుతున్నారని బలమైన ప్రచారం జరుగుతోంది.

వారిలో ఒకరు రా అండ్ రస్టిక్ యాక్షన్ మేకర్ సందీప్ రెడ్డి వంగా కాగా.. మరొకరు విజనరీ మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్. వీరిద్దరిలో ఒకరికే మహేష్ తదుపరి సినిమా చేసే అవకాశం ఇవ్వనున్నారని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తీర్చిదిద్దే క్యారెక్టరైజేషన్లు, హై-వోల్టేజ్ ఎమోషన్లు హీరోల ఇమేజ్‌ను సరికొత్తగా ఆవిష్కరిస్తాయి. మహేష్‌లోని వింటేజ్ మాస్ ,

ఇంటెన్సిటీని బయటకు తీసే సామర్థ్యం సందీప్‌కు ఉందని అభిమానులు సైతం భావిస్తున్నారు. గతంలోనే ఇద్దరి మధ్య చర్చలు జరిగినప్పటికీ, సరైన సమయం కోసం నిరీక్షించారు. తాజాగా -వారణాసి- తర్వాత మహేష్‌ను మరో స్థాయిలో నిలబెట్టే పవర్‌ఫుల్ కథ సందీప్ వద్ద ఉందనే వార్తలు తెరపైకి వస్తున్నాయి. మరోవైపు ప్రశాంత్ నీల్ తనదైన బిగ్ స్కేల్ లార్జర్ ద్యాన్ లైఫ్ ఎలివేషన్లకు, వరల్డ్ బిల్డింగ్‌కు పేరుగాంచారు. -కెజిఎఫ్-, -సలార్- వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించిన ప్రశాంత్ నీల్ మేకింగ్ స్టైల్ మహేష్ మాస్ ఇమేజ్‌కు తోడైతే బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం తప్పదనే అంచనాలు ఉన్నాయి. ఇద్దరి కాంబినేషన్ కుదిరితే భారీ అంచనాలతో గ్లోబల్ వైడ్ మార్కెట్‌ను టార్గెట్ చేయడం సులువవుతుంది. రాజమౌళి కాంబినేషన్ తర్వాత ప్రతీ కథానాయకుడిపై మార్కెట్ ఒత్తిడి .. ప్రేక్షకుల అంచనాలు భారీ పెరుగుతాయన్నది వాస్తవం. అలాంటి సమయంలో ఏమాత్రం కాంప్రమైజ్ కాకుండా తన రేంజ్‌ను నిలబెట్టుకునేలా సందీప్ రెడ్డి వంగా లేదా ప్రశాంత్ నీల్‌లతో ముందుకు వెళ్లడమే సరైన వ్యూహమని మహేష్ భావిస్తున్నట్లు సమాచారం. ఇద్దరిలో ఎవరు ముందుగా మహేష్‌ను మెప్పించే స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తారో? వారితోనే ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉంది. మొత్తానికి మహేష్ భవిష్యత్తు ప్రాజెక్ట్‌లపై స్పష్టమైన ప్లానింగ్‌తో ఉన్నట్లు కనిపిస్తోంది. సందీప్ రెడ్డి వంగా అందించే ఇంటెన్స్ డ్రామానా లేక ప్రశాంత్ నీల్ సృష్టించే లార్జర్ ద్యాన్ లైఫ్ యాక్షన్ వరల్డా అనే దానిపై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965